



విద్యాశాఖ కార్యాలయం

ఉత్తమ గురువులు లేరయా..!



10 మండలాలకు మొండి చేయి

జిల్లాలో 63 మందికి పురస్కారాలు
జాబితాలో ఐదుగురు ఎంఈఓలు
బోధనేతరులకు పురస్కారాలపై విమర్శలు

అనంతపురం విద్య, సెప్టెంబరు 4: ఉపాధ్యాయ దినోత్సవం వివాదాలకు తావిస్తోంది. ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాల ఎంపికలో ఆశ్రిత పక్షపాతం చూపించారని విమర్శలు వస్తున్నాయి. కొన్ని మండలాలకు ప్రాధాన్యం ఇవ్వడం, పది మండలాలలో ఒక్కరినీ ఎంపిక చేయకపోవడం విస్తుగొలుపుతోంది. వేడుక నిర్వహణలో కీలకంగా వ్యవహరిస్తున్న కొందరు అధికారులు, ఎంఈఓలు తమ వెంట నడిచేవారి, నచ్చిన వారి పేర్లను అవార్డుల జాబితాలో చేర్పించారని ఆరోపణలు వస్తున్నాయి. సాధారణంగా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలను పాఠాలను బోధించే ఉపాధ్యాయులకు అందిస్తారు. కానీ పాఠశాలలను పర్యవేక్షించే ఎంఈఓలు, డిప్యూటీ డీఈఓలు, డీఈఓలకు గురుపూజోత్సవం రోజున పురస్కారాలు ఇచ్చిన దాఖలాలు లేవు. తాజాగా ఆ సంప్రదాయాన్ని పక్కన పెట్టి.. కొందరు విద్యాశాఖ అధికారులకు పురస్కారాలను ప్రకటించారు. కొన్ని మండలాలకు పెద్దపీట వేసి ఎక్కువ అవార్డులు ఇచ్చారు. కొన్ని మండలాలకు రిక్త హస్తం చూపించారు. విద్యాశాఖ ఎంపిక చేసిన 63 మంది ఉత్తమ ఉపాధ్యాయుల జాబితాలో పలువురిని అడ్డగోలుగా చేర్చారన్న విమర్శలు వస్తున్నాయి.

పది మండలాలకు రిక్తహస్తం



ఆర్ట్స్ కాలేజీ డ్రామా హాల్‌లో గురువారం గురుపూజోత్సవాన్ని నిర్వహిస్తారు. ఈ సందర్భంగా అందజేసే పురస్కారాలకు 63 మందిని ఎంపిక చేశారు. జాబితాలో ఎస్‌జీటీలు, స్కూల్ అసిస్టెంట్లు, వ్యాయామ ఉపాధ్యాయులు, ప్రైమరీ, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు, ఎంఈఓలు ఉన్నారు. జిల్లాలో 31 మండలాలు ఉండగా.. బెళుగుప్ప మండలం నుంచి ఏకంగా 11 మందికి పురస్కారాలను ప్రకటించారు. ఇతర మండలాల నుంచి ఒకటి, రెండు, మూడు, నాలుగు చొప్పున ఎంపిక చేశారు. పది మండలాలకు జాబితాలో చోటే దక్కలేదు. బొమ్మనహాళ్, బ్రహ్మసముద్రం, డి.హీరేహాళ్, గుత్తి, గుమ్మఘట్ట, పుట్లూరు రాప్తాడు, తాడిపత్రి, యాడికి, యల్లనూరు మండలాలకు ఒక్క అవార్డు కూడా దక్కలేదు.

పర్యవేక్షించే వారికి పట్టం

మండల విద్యాశాఖ అధికారులకు గతంలో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు ఇచ్చిన దాఖలాలు లేవు. స్కూళ్లు, కళాశాలలు, యూనివర్సిటీల్లో పాఠాలు బోధించే టీచర్లు, లెక్చరర్లు, ప్రొఫెసర్లకు సహజంగా అవార్డులు ఇస్తారు. రాష్ట్ర అవార్డుల్లోనూ ఇంచుమించు ఇదే సంప్రదాయాన్ని పాటిస్తారు. విద్యాశాఖ అధికారులైన ఎంఈఓలు, డిప్యూటీ డీఈఓలు, డీఈఓలు ఉత్తమ సేవలు అందిస్తే.. వారికి ఆగస్టు 15న, లేదా జనవరి 26న పురస్కారాలను అందజేస్తారు. ఉపాధ్యాయ దినోత్సవాన ఎక్కువగా బోధన విధుల్లో ఉండే గురువులకు పురస్కారాలను ఇస్తారు. కానీ ఈ ఏడాది జిల్లా విద్యాశాఖ అధికారులు ఐదుగురు ఎంఈఓలను పురస్కారాలకు ఎంపిక చేసి.. చర్చల్లో నిలిచారు.

సోషల్ మీడియాలో విమర్శలతో పోస్టు

బెలుగుప్ప మండలంలో నిత్యము వివాదంతో ఉద్యోగం చేసే హరికృష్ణకు ఉత్తమ మండల విద్యాశాఖ అధికారిని ఉపసంహరించుకోవాలి మండలంలో మహిళల ఉపాధ్యాయుల పట్లు ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయులు పట్లు దురుసుగా ప్రవర్తిస్తూ వారిని అవమానకరంగా మాట్లాడుతూ నిత్యం వివాదాలకు కేంద్ర బిందువుగా ఉన్న మండల విద్యాశాఖ అధికారినీ ఉత్తమ మండల విద్యాశాఖ అధికారిగా ఎంపిక చేయడం దారుణం దీని తీవ్రంగా ఖండిస్తున్నాను గౌరవనీయులైన జిల్లా విద్యాశాఖ అధికారి ఈ విషయంలో పునరాలోచించాలని విద్యాశాఖ ఉన్నత అధికారులకు తెలియజేస్తున్నాం
అంతకంటే నిజాయితీగా పనిచేసే ఇతర (నేను కాదు)మండల విద్యాశాఖ అధికారులను గౌరవించకపోవడం దారుణం
ఎవరో ఒకరు ఇద్దరు సలహా సూచనలు మేరకు హరికృష్ణ కు అవార్డ్ ప్రకటించారు అన్న అనుమానం కలుగుతుంది
ఇది ఇది ఉపాధ్యాయ దినోత్సవానికి తీవ్ర మచ్చ
గమనించాలి

విమర్శలు.. వివాదాలు

బెళుగుప్ప మండలంలో ఓ ఎంఈఓకు అవార్డు జాబితాలో చోటు కల్పించారు. దీంతో అదే సామాజిక వర్గానికి చెందిన మరో ఎంఈఓ సోషల్ మీడియాలో విమర్శలకు దిగారు. ఏ ప్రాతిపదికన ఎంఈఓలను అవార్డులకు ఎంపిక చేశారని పలువురు ఉపాధ్యాయులు, ఎంఈఓలు ప్రశ్నిస్తున్నారు. 2024-2025 ఏడాది యూ-డైస్ అప్‌డేట్‌లో యల్లనూరు మండలం 100 శాతం, పుట్లూరు మండలం 99.02 శాతం ప్రోగెస్ ఉంది. టీచర్స్ అటెండెన్స్, స్టూడెంట్ అటెండెన్స్ తదితర విషయాల్లో కూడా ఆ మండలాలు ముందు వరుసలో ఉన్నాయి. కానీ ప్రగతిలో వెనుక బడిన మండలాల ఎంఈఓలకు అవార్డులను అవార్డులకు ఎంపిక చేశారు. 2022-23 విద్యాసంవత్సరంలో అవార్డు తీసుకున్న ఓ ఉపాధ్యాయనికి మరోసారి పురస్కారం ప్రకటించారు. కొందరు దరఖాస్తు చేసుకోకపోయినా పిలిచి మరీ ఎంపిక చేసినట్లు తెలుస్తోంది.

అయ్యో.. దేవుడా..!

మొన్న భర్త... నేడు కుమారుడు



చికిత్స పొందుతూ మరణించిన అబ్దుల్లా

ప్రాణాలు తీసిన పాడు జ్వరం
కన్నీరుమున్నీరైన బాధితురాలు రమీజ



కన్నీరుమున్నీరవుతున్న రమీజ

అనంతపురం టౌన్, సెప్టెంబరు 4: వారం రోజుల్లోనే భర్త, కుమారుడు జ్వరంతో మృతి చెందడంతో ఆ ఇల్లాలు కన్నీరు మున్నీరుగా విలపించడం చూపరులకు సైతం కంటతడి పెట్టించింది. గార్లదిన్నె మండలం ఇల్లూరుకు చెందిన వన్నూరుస్వామి(40) ఆయన కుమారుడు అబ్దుల్లా(15) వారం రోజుల కిందట జ్వరంతో బాధపడుతూ స్థానిక ఆస్పత్రుల్లోనే వైద్యం చేయించుకు న్నారు. పరిస్థితి విషమించడంతో కుటుంబసభ్యులు గత నెల 31న చికిత్స కోసం జిల్లా సర్వజన ఆస్పత్రికి తీసుకొచ్చారు. పరీక్షించిన వైద్యులు వన్నూరుస్వామి పరిస్థితి సీరియస్‌గా ఉందని చెప్పడంతో అదేరోజు రాత్రి నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి మరింత విషమంగా మారడంతో మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలిస్తుండగా ఈనెల 1న మార్గమధ్య లోనే మృతి చెందాడు. కుమారుడు అబ్దుల్లా జిల్లాసర్వజనాస్పత్రిలోని ఐసీయూ లోనే చికిత్స పొందుతూ వచ్చారు. అయితే పరిస్థితి విషమించి బుధవారం అబ్దుల్లా కూడా ప్రాణాలు వదిలాడు. దీంతో తల్లి రమీజ గుండెలవిసేలా రోదించింది. మొన్న మొగుడు, ఇపుడు ఉన్న ఒక్కగానొక్క కొడుకును దూరం చేశావు. దేవుడా నేనేమి ఖర్మ చేశాను. నాకెందుకీ శిక్ష అంటూ రోదించడం అక్కడున్న వారందరినీ కంటతడి పెట్టించింది. ఆమెను ఓదార్చడం ఎవరి తరమూ కాలేదు.

శ్రద్ధ చూపింటే బతికి ఉండేవాడేమో..!

డెంగీ జ్వరంతో అబ్దుల్లా తండ్రి వన్నూరుస్వామి చనిపోయినట్లు ప్రచారం వచ్చింది. అదే జ్వరంతోనే అబ్దుల్లా కూడా ఆస్పత్రిలో ఇబ్బంది పడుతున్నాడని ఇదే విషయాన్ని 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైంది. జిల్లా ఆస్పత్రిలోని ఐసీయూలో ఉన్నా డాక్టర్లు సక్రమంగా పట్టించుకోదంటున్నారని, ఇప్పటికే తండ్రి చనిపోయాడని, కనీసం ఆ పిల్లవాడికైనా సరైన వైద్యం అందేలా చూడాలని డీఎంహెచ్ఓ, డీఎంఓల దృష్టికి 'ఆంధ్రజ్యోతి' తీసికెళ్లింది. తాము వెళ్లి పరిశీలించి సరైనవైద్యం అందేలా చూస్తామని వారు పేర్కొన్నారు. కానీ ఆస్పత్రి వైపుకూడా వెళ్లలేదు, కనీసం ఎట్లా ఉందని కూడా ఆరా తీయలేదని బాధిత కుటుంబసభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైద్యులు కాస్త శ్రద్ధ చూపి ఉంటే అబ్దుల్లా బతికి ఉండేవాడని పలువురు తీవ్రంగా విమర్శిస్తున్నారు.



తండ్రీకొడుకులపై ఆంధ్రజ్యోతి కథనం

హైమాస్ట్ అక్రమాలు..!



కవితా హోటల్ సర్కిల్‌లో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్

ఉరవకొండ మేజర్ పంచాయతీలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్ల కథ కంచికి చేరిందేమోనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వీటి ఏర్పాటులో భారీగా అక్రమాలు జరిగినట్లు బయటపడినా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. ఉరవకొండ మేజర్ పంచాయతీ ఆధ్వర్యంలో పట్టణంలోని నాలుగు ప్రధాన కూడళ్లలో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేసేందుకు 2023లో టెండర్లు నిర్వహించారు. హైదరాబాదుకు చెందిన మోక్ష అసోసియేట్స్, శ్రీ ఫ్రాలైట్ ఇండియా వారు టెండర్లు దాఖలు చేశారు. తక్కువ ధరకు కోట్ చేసిన శ్రీ ఫ్రాలైట్ ఇండియా వారు (రూ.2,11,382) టెండరు దక్కించుకున్నారు. పట్టణంలోని కవితా హోటల్ సర్కిల్, గుంతకల్లు రోడ్డు, అనంతపురం-బళ్లారి రహదారి, కణేకల్లు రోడ్డులో లైట్‌లను ఏర్పాటు చేశారు. పనులు దక్కించుకున్నది రూ.2.11 లక్షలకు కాగా, ఒక్కొక్క లైటుకు రూ.3.36 లక్షల దాకా బిల్లులు చేసుకున్నారు. నాలుగు లైట్లకు కలిపి రూ.5 లక్షలకు పైగా స్వాహా చేశారన్న ఆరోపణలు వచ్చాయి. రాయంపల్లి సర్కిల్‌లో మరో హైమాస్ట్ లైట్‌ను ఏర్పాటు చేసి, రూ.3,41,650 బిల్లులు డ్రా చేసేందుకు ప్రయత్నించారు. ఈ అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలని టీడీపీ వార్డు సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. జిల్లా పంచాయతీ అధికారికి ఫిర్యాదు చేసి రెండు నెలలు కావస్తున్నా చర్యలు తీసుకోలేదని విమర్శిస్తున్నారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి గౌస్ సాహెబ్‌ను వివరణ కోరగా, విడిభాగాలతో కలిసి రూ.3 లక్షల దాకా అయ్యిందని అన్నారు.

- ఉరవకొండ

ఎకరాకు లక్ష ఇస్తే చాలు..!

వ్యవసాయ భూముల్లో రియల్ ఎస్టేట్
ఎన్ఓసీలు రాకున్నా ప్లాట్లు వేసుకోవచ్చు
ఎకరాకు రూ.లక్ష పుచ్చుకుంటున్న అధికారులు
వంక నారవలు, కుంటలు పూడ్చేస్తున్న రియల్టర్లు

పుట్లూరు, సెప్టెంబరు 4: రోడ్డు పక్కన ఖాళీ భూమి కనబడితే చాలు రియల్టర్లు పాగా వేస్తున్నారు. వ్యవసాయ భూముల్లో ఎలాంటి అనుమతులు లేకుండానే రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. ఆ భూముల్లో వంక నారవలు ఉన్నా, కుంటలు ఉన్నా పూడ్చేసి, ప్లాట్లు వేసి విక్రయానికి సిద్ధం చేస్తున్నారు. మండల వ్యాప్తంగా సుమారు 40 ఎకరాలకు పైగా భూమిలో రియల్టర్లు వెంచర్లు వేశారు. ఎకరానికి లక్ష రూపాయల చొప్పున ఇస్తే చాలు అధికారులు చూసీచూడనట్లు ఉన్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అందుకే మండలంలోని వ్యవసాయ భూముల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం జరుగుతున్నా ఏ ఒక్క అధికారి పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మండలంలో గాండ్లపాడు, పోతిరెడ్డిపల్లి, పుట్లూరు, ఏ. కొండాపురం, నాగిరెడ్డిపల్లి తదితర గ్రామాల్లో వ్యవసాయ భూములను ప్లాట్లుగా వేస్తున్నారు. గాండ్లపాడు రెవెన్యూలో ఐదుచోట్ల, పుట్లూరు రెండుచోట్ల, ఏ. కొండాపురంలో ఒకచోట, నాగిరెడ్డిపల్లి శివారులోని బస్టాప్ వద్ద వెంచర్లు వేశారు. ఈ వెంచర్లలో చాలాచోట్ల వంక నారవలు ఉన్నాయి. అక్కడ ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదన్న నిబంధనలు ఉన్నాయి. మరోచోట తవ్విన కుంటను పూడ్చివేసి వాటిలో ప్లాట్లు వేసి విక్రయానికి సిద్ధం చేశారు. మరోచోట తారురోడ్డుదాకా వెంచర్ల హద్దులు వేశారు. ఇవన్నీ చూస్తున్న అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి.



కుంటను పూడ్చి ప్లాట్లు వేసిన దృశ్యం

చేతులు మారుతున్న లక్షలు

తాడిపత్రి ప్రాంతానికి సరిహద్దు గ్రామాలు కావడంతో వ్యవసాయభూముల ధరలు అమాంతం పెరిగిపోయాయి. గాండ్లపాడు, పుట్లూరు, ఏ. కొండాపురం గ్రామాల్లో ఎకరా ధర సుమారు రూ.20లక్షల నుంచి రూ.30లక్షల మేర పలుకుతోంది. దీంతో వ్యవసాయ భూములను సైతం కొందరు రియల్టర్లు కొనుగోలు చేసి ప్లాట్లుగా మారుస్తున్నారు. ఇలా మార్చాలంటే రెవెన్యూ, పంచాయతీరాజ్‌శాఖల అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉంటుంది. ముఖ్యంగా వాటితోపాటు ఎన్ఓసీ తప్పనిసరిగా తీసుకోవాలి. ఈ నిబంధనలు పాటించకుండా స్థానిక అధికారులకే ఆమ్యామ్యాలు ఇచ్చి పనులు చేసుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. వ్యవసాయ భూములను ప్లాట్లుగా మార్చేందుకు సుమారు మూడునెలల వ్యవధి అవుతుంది. కానీ స్థానిక అధికారులతో మాట్లాడుకుంటే ముచ్చటగా మూడురోజుల్లో పనులు చకచక పూర్తవుతాయన్న ఆలోచనతో ఎకరానికి లక్ష రూపాయల చొప్పున వారికి ముట్ట చెబుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.



ప్లాట్లు వేసిన వెంచర్‌లో నిలబడిన వర్షపునీరు

చక్రం తిప్పుతున్న వీఆర్వోలు

వ్యవసాయ భూముల్లో ప్లాట్లు వేసే విషయంలో ఆయా గ్రామాల పరిధిలో ఉన్న వీఆర్వోలు చక్రం తిప్పుతున్నారన్న విమర్శలు ఉన్నాయి. అప్పట్లో రియల్టర్లు కొందరు వైసీపీ నాయకులకు సన్నిహితులుగా ఉండటం, వీరికి వీఆర్వోలు వత్తాసు పలకడంతో ఎన్ఓసీలు లేకుండానే ప్లాట్లు వేశారని తెలిసింది. ఓ గ్రామపరిధిలో ఉన్న వీఆర్వో నేరుగా కార్యాలయంలోని ఓ అధికారితో సంప్రదింపులు జరిపి పనులు చక్కబెట్టినట్లు తెలిసింది. ఆ గ్రామపరిధిలో ఎక్కువ ప్లాట్లు ఉండటంతో కార్యాలయంలో కూడా ఆయన చెప్పిందే వేదం అన్నట్లు హవా సాగుతోంది. గతంలో పుట్లూరులో పనిచేసిన వీఆర్వోకి రియల్టర్లు పలు రూపాల్లో కానుకలు ఇచ్చారన్న విమర్శలు ఉన్నాయి. ఆయన ఉద్యోగ విరమణ దగ్గర ఉండటంతో ప్రస్తుతం చేస్తున్న రెవెన్యూ విలేజ్‌లో కొండప్రాంతంలోని భూమిని పలువురు వైసీపీ నాయకులకు రాయించారన్న ఆరోపణలు ఉన్నాయి.

కఠిన చర్యలు తీసుకుంటాం



మండలంలో ఎన్ఓసీ లేకుండా వ్యవసాయ భూమిలో ప్లాట్లు వేయడం నాదృష్టికి రాలేదు. ఎవరైనా ఫిర్యాదులు చేస్తే విచారించి కఠిన చర్యలు తీసుకుంటాం. నిబంధనల మేరకే ఎవరైనా ప్లాట్లు వేసుకోవాలి. ఎన్ఓసీ లేకుంటే చర్యలు తప్పవు.

- శేషారెడ్డి, తహసీల్దార్

ఆ లెక్చరర్‌ను మార్చండి..!

తల్లిదండ్రుల డిమాండ్.. మోడల్ స్కూల్ వద్ద ఆందోళన



మోడల్‌స్కూల్ ఎదుట నిరసన తెలుపుతున్న విద్యార్థులు

చెన్నేకొత్తపల్లి, సెప్టెంబరు 4: మోడల్ పాఠశాల ఎకనామిక్స్ లెక్చరర్ విజయలక్ష్మి విద్యార్థులను హింసిస్తోందని ఆరోపిస్తూ తల్లిదండ్రులు, విద్యార్థులు పాఠశాల వద్ద బుధవారం ఆందోళనకు దిగారు. సీపీఎం మండల నాయకుడు లింగన్న, ఇంటర్, పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల వద్ద బైఠాయించారు. పాఠాలు సరిగా చెప్పకపోగా, విద్యార్థులను మోకాళ్లపై కూర్చోబెట్టి హింసిస్తోందని మండిపడ్డారు. ఆమెను బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. మరికొందరు అధ్యాపకుల తీరు కూడా ఇదేలా ఉందని మండిపడ్డారు. ప్రిన్సిపాల్ స్వర్ణలత సర్దిచెప్పినా వినుకోలేదు. దీంతో లెక్చరర్ విజయలక్ష్మిని తన చాంబర్‌కు పిలిపించి, తల్లిదండ్రుల ఎదుట విచారించారు. తాను పిల్లలను హింసించడం లేదని ఆమె వివరణ ఇచ్చారు. తల్లిదండ్రులు శాంతించకపోవడంతో క్షమాపణ చెప్పారు. మరోసారి ఇలాంటి సంఘటనలు జరగకుండా తగిన చర్యలు తీసుకుంటానని తల్లిదండ్రులకు ప్రిన్సిపాల్ హామీ ఇచ్చారు. దీంతో ఆందోళన విరమించారు.

వస్తాయో.. రావో !

ఏళ్ల తరబడి పెండింగ్‌లో పీఆర్ బిల్లులు
రూ. 25 కోట్ల వరకు బకాయిలు
అయోమయంలో కాంట్రాక్టర్లు



జిల్లా పంచాయతీ రాజ్‌శాఖ కార్యాలయం

అనంతపురం సిటీ, సెప్టెంబరు 4: ప్రభుత్వ పనులు దక్కితే సంతోషపడ్డారు. చకచకా నిర్మాణాలు కూడా ప్రారంభించారు. అయితే పనులు ఎంత మేరకు చేసినా బిల్లులు రాకపోవడంతో అర్ధంతరంగా ఆపేశారు. ఈక్రమంలోనే రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలు రావడం, వైసీపీ ఓడిపోయి టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చింది. దీంతో గత ప్రభుత్వ పాలనలో చేసిన పనులకు బిల్లులు వస్తాయో రావోనని సంబంధిత కాంట్రాక్టర్లు ఆందోళన చెందుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో చేసిన నిర్మాణాలకు సంబంధించి రూ.25 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు బాధిత కాంట్రాక్టర్లు చెబుతున్నారు. ఇదంతా వైసీపీ పాలకుల పాపమేనని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పుడే బిల్లులు మంజూరు చేసి ఉంటే ఇప్పుడు తమకు ఈ పరిస్థితి ఉండేది కాదని వారు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం పార్టీలతో సంబంధం లేకుండా తమ పెండింగ్ బిల్లులు మంజూరు చేస్తుందో..? లేదో అని కాంట్రార్లు ఆందోళన చెందుతున్నారు.

రూ. 25 కోట్ల వరకు పెండింగ్..

వైసీపీ ఐదేళ్ల పాలనలో ఆశించిన స్థాయిలో అభివృద్ధి పనులు సాగలేదు. గత ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా పంచాయతీ రాజ్ శాఖ ద్వారా చేపట్టిన గ్రామ, వార్డు సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌లు, డిజిటల్ లైబ్రరీల భవనాల పనులు ఆశించిన స్థాయిలో ముందుకు సాగలేదు. బిల్లుల జాప్యంతోనే పనులు జరగలేదని కాంట్రాక్టర్లు చెబుతున్నారు. అధికారిక లెక్కల ప్రకారం భవనాల పరంగా రూ. 15 కోట్లు, సీసీ, బీటీ రోడ్ల పరంగా రూ. 10 కోట్లు మొత్తంగా రూ. 25 కోట్ల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి.

జిల్లాలో పెండింగ్ బిల్లుల వివరాలు ఇలా..

- సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్ఆర్ క్లినిక్‌లు, డిజిటల్ లైబ్రరీలకు సంబంధించి పెండింగ్‌లు బిల్లులు : రూ. 15 కోట్లు
- గ్రామీణ ప్రాంతాల్లోని సీసీ, బీటీ రోడ్లకు చెందిన పెండింగ్‌లు బిల్లులు : రూ. 10 కోట్లు.

బిల్లుల పెండింగ్ వాస్తవమే



పలు భవనాలు, రోడ్లకు సంబంధించి రూ. 25 కోట్లు బిల్లులు పెండింగ్‌లో ఉన్న విషయం వాస్తవమే. ఇదే విషయాన్ని ప్రస్తుత ప్రభుత్వానికి నివేదించాం. కాంట్రాక్టర్లకు ఇబ్బంది లేకుండా బిల్లులు చెల్లించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసు కుంటుందని ఉన్నతాధికారుల ద్వారా తెలిసింది.

- కేవీ కేవీ ప్రసాద్, ఎస్ఈ, పంచాయతీ రాజ్‌శాఖ

ఉత్పత్తిదారుల సంఘాలకు సంపూర్ణ సహకారం: కలెక్టర్


ఉత్పత్తి చేసిన వస్తువులను పరిశీలిస్తున్న కలెక్టరు

అనంతపురం టౌన్, సెప్టెంబరు 4: జిల్లాలో ఉత్పత్తిదారుల సంఘాలకు సంపూర్ణ సహకారం అందిస్తామని జిల్లా కలెక్టరు వినోద్‌కుమార్ భరోసా ఇచ్చారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, వివిధశాఖల అధికారులతో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. ప్రదర్శనకు ఉంచిన పలు ఉత్పత్తి వస్తువులను చూసి ఆయన ఉత్పత్తిదారులను అభినందించారు. అనంతరం సమావేశంలో కలెక్టరు మాట్లాడుతూ ఉత్పత్తిదారుల సంఘాల సేవలు అభినందనీయమ న్నారు. సంఘాల ద్వారా తయారు చేసిన వస్తువులను ప్రదర్శించి అమ్మకాలను ప్రోత్సహించేందుకు స్టాల్స్‌ను ఏర్పాటు చేయించాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ జేడీ ఉమా మహేశ్వరమ్మ, జడ్పీసీఈఓ ఓబులమ్మ, నాబార్డు డీడీఎం అనూరాధతో పాటు పలువురు అధికారులు, సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

63 మంది గురువులకు 'ఉత్తమ' అవార్డులు

అనంతపురం విద్య, సెప్టెంబరు 4: జిల్లాలో గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని 63 మందికి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందిస్తున్నట్లు డీఈఓ వరలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఆర్ట్స్ కాలేజ్ డ్రామా హాల్‌లో ఉదయం 10 గంటలకు గురుపూజోత్సవం వేడుక ప్రారంభం అవుతుందన్నారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికైన ఉపాధ్యాయులందరూ కార్యక్రమానికి హాజరై సన్మానం స్వీకరించాలన్నారు. అన్ని యాజమాన్య పాఠశాలల ప్రధానోపాధ్యాయు లు, మండల విద్యాశాఖాధికారులు, ఉపాధ్యాయ సంఘాల నేతలు హాజరుకావాలని కోరారు.

10న అడ్మిషన్లకు కౌన్సెలింగ్

అనంతపురం టౌన్, సెప్టెంబరు 4: అనంత వైద్యకళాశాలలో పారా మెడికల్ కోర్సుల్లో చేరడానికి ఈనెల 10న అడ్మిషన్ల కౌన్సెలింగ్ చేపడుతు న్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యాలరావు బుధవారం ఓ ప్రకటనలో తెలి పారు. మొత్తం 69 సీట్లు ఉన్నాయని, అందులో డీఎంఎల్‌టీ10, డీఓఏ10, డీఏఎన్ఎస్30, డీఎంఐటీ10, డీఈసీజీ3, డీఆర్‌జీఏ3, డీడీఆర్‌ఏ3సీట్లు ఉన్నాయన్నారు. ఈసీట్లకు ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు 10న తమ ఒరిజనల్ సర్టిఫికెట్లు తీసుకొని అడ్మిషన్ల కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని ప్రిన్సిపాల్ కోరారు.

రిజర్వాయర్‌కు 1,098 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, సెప్టెంబరు 4: మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు బుధవారం కృష్ణాజలాల ఇన్‌ఫ్లో 1098 క్యూసెక్కులు వస్తున్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. ఔట్‌ఫ్లో ఫేజ్-2కు 947 క్యూసెక్కులు, మరువ నుంచి 111క్యూసెక్కులు వెళుతోందని వారు వెల్లడించారు.

వరద బాధితులకు విరాళాలివ్వండి

పుట్టపర్తి, సెప్టెంబరు 4: వరద బాధితులను ఆదుకునేందుకు దాతలు ముందుకురావాలని శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ బుధవారం ఓ ప్రకటనలో కోరారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఇచ్చిన పిలుపు మేరకు ప్రతి ఒక్కరూ విరాళాలు అందించాలన్నారు. దాతలు ఈ కింది బ్యాంక్‌లకు తమ విరాళాలు పంపాలన్నారు.

- ఎస్బీఐ సీఎంఆర్ఎఫ్ అకౌంట్ నెంబర్ 38588079208 ఐఎఫ్ఎస్‌సీ కోడ్ ఎస్బీఐఎన్ 0018884,
- యూనియన్ బ్యాంకు సీఎంఆర్ఎఫ్ అకౌంట్ నెంబర్ 110310100029039 ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0830798,
- ఎస్బీఐ ఏపీడిజాస్టర్ మేనేజ్‌మెంట్ అకౌంట్ నెంబర్ 00000036897128069 ఐఎఫ్ఎస్‌సీ కోడ్ ఎస్బీఐఎన్ 0016857

పరీక్ష ఫలితాలు విడుదల


ఫలితాలను విడుదల చేస్తున్న వీసీ సుదర్శన రావు

అనంతపురం సెంట్రల్, సెప్టెంబరు 4: జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ పరీక్షల ఫలితాలను ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ సుదర్శన రావు ఆన్‌లైన్ ద్వారా బుధవారం విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ వర్సిటీ అనుబంధ కళాశాలల ఎంసీఏ, ఎంబీఏ విద్యార్థులకు జూలైలో పరీక్షలు నిర్వహించామన్నారు. ఎంసీఏ ద్వితీయ సెమిస్టర్(ఆర్21) రెగ్యులర్, (ఆర్20, 17) సప్లిమెంటరీ పరీక్షలతోపాటు ఎంబీఏ ద్వితీయ సెమిస్టర్(ఆర్21) రెగ్యులర్,(ఆర్17) సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు విడు దల చేశామని తెలిపారు. విద్యార్థులు వారి ఫలితాలకోసం www.jntuaresults.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు. కార్యక్రమంలో డీఈ ప్రొఫెసర్ నాగప్రసాద్ నాయుడు, సీఈ శివకుమార్, ఏసీఈలు శేఖర్‌రాజు, అంకారావు, శ్రీధర్ పాల్గొన్నారు.

ఎంటెక్ ఫలితాలు...

జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల ఎంటెక్ ద్వితీయ సెమిస్టర్(ఆర్21) రెగ్యులర్ విద్యార్థులకు జూలై, ఆగస్టులో నిర్వహించిన పరీక్షల ఫలితాలను ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చెన్నారెడ్డి తన కార్యాలయంలో విడుదల చేశారు. ఫలితాల కోసం కళాశాల అకడమిక్ సెక్షన్‌లో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వసుంధర, డీసీఈలు లలితకుమారి, విష్ణువర్ధన్, విభాగాధిపతులు భారతి, కళ్యాణిరాధ, మమత, భువన విజయ, రామశేఖర్ రెడ్డి, దిలీప్ కుమార్ పాల్గొన్నారు.

కేసుల పరిష్కారానికి కృషి చేయండి

- న్యాయాధికారి శ్రీనివాస్

అనంతపురం క్రైం, సెప్టెంబరు 4: బ్యాంకులు, ఇతర విభాగాల పరిధిలో వీలైనన్ని కేసుల పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్ సూచించారు. జిల్లా కోర్టులోని న్యాయాధికారి చాంబర్‌లో ఈనెల 14న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌కు సంబంధించి లీడ్ బ్యాంకు మేనేజర్, బీమా కంపెనీలు, ఏపీఎస్ ఆర్టీసీ, చిట్‌ఫండ్ కంపెనీల వాళ్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయాధి కారి మాట్లాడుతూ ఆర్థిక వివాదాలున్న సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలన్నారు.

సద్వినియోగం చేసుకోండి

జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్‌యాదవ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల పరిధిలోని కోర్టులలో మోటార్ వాహనాల ప్రమాద భరిత కేసులు, సివిల్ కేసులు, చెక్‌బౌన్సు కేసులు, కుటుంబ తగాదాలు(విడాకుల కేసులు కాకుండా), పారిశ్రామిక వివాదాలు, రాజీ చేయదగిన క్రిమినల్ కేసులు, ప్రి లిటిగేషన్ కేసులను జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ చేస్తామని వెల్లడించారు.

టమాట మాట్లాడలేం..!

- భారీగా పతనమైన టమోటా ధరలు
- గిట్టుబాటు ధరలేక నష్టాల ఊబిలో రైతులు
- వర్షాలకు మరింతగా నష్టపోయిన దుస్థితి
- పంటను పశువులకు వదిలేస్తున్న వైనం

అనంతపురంరూరల్/ఆత్మకూరు, సెప్టెంబరు4: ధరలు పతనమవడంతో టమోటా రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. అప్పులు చేసి, ఆరుగాలం శ్రమించి పండించిన పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో మరిన్ని అప్పులు పెరుగుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు మార్కెట్‌లో వ్యాపారుల దోపిడీ రైతులను మరింత కుంగదీస్తోంది.

ఉమ్మడి జిల్లాలో 24వేల హెక్టారల్లో సాగు

ఉమ్మడి జిల్లాలో 24వేల హెక్టార్లల్లో టమోటా సాగు చేసినట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. కంబదూరు, కళ్యాణదుర్గం, అనంతపురం రూరల్, ముదిగుబ్బ, కదిరి, ధర్మవరం, అనంతపురంరూరల్, పామిడి, శెట్టూరు, ఆత్మకూరు, గార్లదిన్నె, కూడేరు తదితర మండలాల్లో టమోటాను అధికంగా సాగు చేశారు. గత ఏడాది 18వేల నుంచి 20వేల హెక్టార్లల్లో పంట సాగైంది. ఏటా సాగు విస్తీర్ణం పెరుగు తోంది. దిగుబడులు కూడా బాగానే ఉన్నాయి. రోజు కక్కలపల్లి టమోటా మార్కెట్‌కు 2500టన్నుల నుంచి 3500టన్నుల మధ్య వస్తున్నాయి. అయితే గిట్టుబాటు ధర లేకపోవడం రైతుల ఆశలు ఆవిరవుతున్నాయి. వాతావరణ మార్పులతో కాయలపై మచ్చలు వంటివి వస్తే ధర లేకుండా పోతోంది. దీనికితోడు తరచూ కురుస్తున్న వర్షాలకు పంట నీటి పాలవుతోంది. నీరుకాయలుగా పడి నో సేల్ కింద పడిపోవడం, లేదా తక్కువ ధర పలకడం జరుగుతోంది. ఈక్రమంలో పంటను మార్కెట్‌కు తీసుకువెళ్లలేక కొందరూ రైతులు తోటలోనే వదిలేస్తున్నారు. మరికొందరు మార్కెట్‌లో అమ్ముడు పోకపోతే అక్కడే వదిలేస్తున్నారు.

ఒక్కసారి తగిలితే చాలు..

నిత్యం నష్టాలు ఎదురవుతున్నా రైతులు టమోటా పంట సాగును వదలడం లేదు. ఒక్కసారి దిగుబడి, రేటు తగలితే తమ దశ మారిపోతుందన్న నమ్మకమే రైతన్నను టమోటా సాగువైపు నడిపిస్తోంది. మొక్క నాటడం మొదలుకొని పంట కోతకొచ్చేంతవరకు నిత్యం పెట్టుబడులు పెడుతూనే ఉన్నారు. ఈక్రమంలో ఎకరా సాధారణ సాగుకే రూ.40 నుంచి రూ.50వేలు పెట్టుబడులు అవుతున్నట్లు రైతులు చెబుతున్నారు. ఆ తరువాత ఒక సారి పంట కోతకు ఎకరానికి ఆరుగురు కూలీల లెక్కన ఒక్కొక్కరికి రూ.300లు చొప్పున రూ.2వేలు చెల్లిస్తున్నారు. ఆ తరువాత దిగుబడులను మార్కెట్‌కు తీసుకొచ్చేందుకు దూరాన్ని బట్టి సగటున ఒక్కో బాక్సుకు రూ.5 చెల్లిస్తున్నారు.

మార్కెట్‌లో దోపిడీ

వ్యయప్రయాసలకోర్చి పంట పడించి మార్కెట్‌కు తేవడం ఒకెత్తైతే, మార్కెట్‌లో సరుకు అమ్ముడుపోయేంత వరకు రైతులు పడే ఆందోళన మరో ఎత్తు. వ్యాపారుల దోపిడీతో రైతులకు నష్టాలు తప్పడం లేదు. ఇక్కడ పది శాతం కమీషన్ రూపంలో రైతుల నుంచే వసూలు చేస్తున్నారు. దీనికితోడు బాక్సుల బాడుగ, హమాలీ కూలీ బాక్సుకు రూ.1. ఇతరత్ర ఖర్చులన్నీ కలుపుకుని రూ.100కు రూ.15లు మార్కెట్‌లోనే పోతోంది. ఇది చాలదన్నట్లు 100బాక్సులకు 5 బాక్సులు లెస్ చేస్తున్నారు. అంటే బాక్సు రూ.100తో అమ్ముడు పోతే.. ఐదు బాక్సులకు రూ.500లు అక్కడ కోత పడుతోంది. ఈ ఖర్చులన్నీ పోయే సరికి రైతులకు ఏమీ మిగలడం లేదు. పంటకోసి కూలీలకు చేతినుంచి ఇవ్వాల్సిన పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

సీజన్ ప్రారంభం నుంచి ఇదే దుస్థితి..

ఈ సంవత్సరం జూలై నుంచి టమోటా సీజన్ ప్రారంభమైంది. మార్కెట్‌లో ఏనాడు రైతులకు లాభం చేకూరని పరిస్థితి. గత రెండు నెలల కాలంలో మార్కెట్‌లో 15కిలో బాక్సు రూ.400దాటిన దాఖలాలు లేవు. ప్రస్తుతం బాక్సు రూ.300ల వరకు పలుకుతోంది. అయితే అవి మూడు, నాలుగు లాట్ల కంటే ఎక్కువగా ఉండవనే చెప్పొచ్చు. అవి కూడా మార్కెట్‌లో ధర బాగా పలుకుతోందని చెప్పడానికి మాత్రమేనని ఆయా వర్గాల సభ్యులు చెబుతున్నా రు. ఎక్కువ శాతం రూ.50 నుంచి రూ.150లు లోపే ఉంటున్నాయి. ప్రతి రోజు పలికే ధరలే ఇందుకు నిదర్శనం. కనీసం బాక్సు రూ.200పలికినా రైతులకు కొంత ఊరటగా ఉంటుంది. మార్కెట్‌లో ఆ పరిస్థితి లేకపోవడం రైతులకు తీవ్ర వేదన, నష్టాలను మిగుల్చుతోంది.


తోటలో టమోటాను గ్రేడింగ్ చేస్తున్న కూలీలు


మార్కెట్‌కు వచ్చిన టమోటా

ఇంట్లో వాళ్లు వద్దంటున్నా..



ఇంట్లో వాళ్లు వద్దంటు న్నా వినకుండా ఎకరా పొలాన్ని గుత్తకు తీసుకుని టమోటా సాగు చేశా. దాదాపు రూ.50వేలు పెట్టుబడి పెట్టా. పంట బాగానే వచ్చింది. అయితే వర్షానికి పూర్తిగా దెబ్బతింది. అధిక వర్షానికి పొలంలో మూడునాలుగు రోజులు నీళ్లు నిలబడ్డాయి. దీంతో కాయలు తోటలోనే దెబ్బతిన్నాయి. పంట కోయగా 60 బాక్సులయ్యాయి. రూ.1000బాడుగ ఇచ్చి మార్కెట్ తెచ్చా. బాక్సు రూ.రెండు వందలతో అమ్ముడు పోయింది. నాకు ఇంకేం మిగులుతుంది.

- గంగన్న, రైతు, కండ్లపల్లి గ్రామం, పామిడి మండలం

పశువుల మేతకు వదిలేస్తా..

మూడు ఎకరాల్లో పంట సాగు చేశా. రూ.1.5లక్షలు పెట్టుబడి పెట్టా. వర్షాలకు పంట పూర్తిగా దెబ్బతినింది. ఈసారి పంట సాగుకైనా పెట్టుబడులు కూడా దక్కేలే లేవు. పంట దెబ్బతినడంతో పశువుల మేతకు వదిలేయాలని నిర్ణయించుకున్నా.

- పోతిరెడ్డి, రైతు, ఆత్మకూరు

వర్షాల వల్లే...



రెండు ఎకరాల్లో రూ.లక్షకుపైగా పెట్టుబడులు పెట్టి పంట సాగు చేశా. చేతికొచ్చిందనుకునేలోపు వర్షం పంటను దెబ్బతీసింది. వర్షానికి పంట మొత్తం దెబ్బతినింది. కాయలు పనికిరాకుండా పోయాయి. దీనికి తోడు మార్కెట్‌లో ధరలు అంతంతగానే ఉంటున్నాయి. దీంతో పంట సాగు చేయాలన్నా పెట్టుబడులకు భయపడాల్సి వస్తోంది.

- వెంకటరెడ్డి, రైతు, ఆత్మకూరు

నేటి నుంచి రచ్చ రచ్చే..!


ఆటగాళ్లతో మాట్లాడుతున్న త్రీమెన్ కమిటీ సభ్యుడు మాంచో ఫెర్రర్

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 4: దులీప్‌ట్రోఫీ టోర్నీ గురువారం నుంచి అనంతపురం క్రికెట్ గ్రౌండ్ వేదికగా జరగనుంది. తొలిమ్యాచ్ ఇండియా-సి, ఇండియా-డి జట్ల మధ్య జరగనుంది. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ త్రీమెన్ కమిటీ సభ్యులు మాంచో ఫెర్రర్, ఎన్నికైన కార్యదర్శి సతీష్ అనంతపురం క్రికెట్ గ్రౌండ్‌లో ఏర్పాట్లను బుధవారం పరిశీలించారు. ఆయా జట్ల కెప్టెన్లు, ఆటగాళ్లతో మాట్లాడి సదు పాయాల కల్పనపై అభిప్రాయాలను తెలుసుకున్నారు. ప్రేక్షకులు కేటగిరీల వారీగా వాహనాల పార్కింగ్, ఎంట్రీ గేట్లు, గ్రౌండ్‌లో బ్లాక్‌లను పరిశీలించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, మీడియా కోఆర్డినేటర్ తిమ్మప్ప, దులీప్‌ట్రోఫీ ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు షాబుద్దీన్, జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పీఎల్ ప్రకాష్ రెడ్డి, మధు ఆచారి తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజు సాధన: దులీప్‌ట్రోఫీలో పాల్గొనే ఇండియా-సి, ఇండియా-డి జట్ల ఆటగాళ్లు అనంతపురం క్రికెట్ గ్రౌండ్‌లో రెండో రోజు సాధన చేశారు. బుధవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు, మధ్యాహ్నం 2గంటల నుంచి 4.30గంటల వరకు ప్రాక్టీస్ చేశారు.

ఇండియా-సి, డి జట్ల మధ్య నేడు తొలి పోటీ

ఈ వస్తువులు తేవద్దు: స్టేడియంలోకి ల్యాప్‌టాప్, కెమెరాలు, అగ్గిపెట్టెలు, బైనాక్యులర్స్, బ్యాటరీలు, బ్యాగులు, బ్యానర్లు, సిగరెట్లు, లైటర్లు, హెల్మెట్లు, నీళ్ల బాటిళ్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు, షార్ప్ మెటల్స్ వంటి తదితర వస్తువులను అనుమతి లేదు.

ప్రత్యక్ష ప్రసారం: దులీప్‌ట్రోఫీలో భాగంగా జరిగే ఐదు మ్యాచ్‌లను ప్రత్యక్ష ప్రసారం చేయనున్నారు. స్టార్‌స్పోర్ట్స్ 18, జియో చానల్‌లో లైవ్ టెలికాస్ట్ చేయనున్నారు. మొదటి మ్యాచ్ 5 నుంచి 8వతేదీ వరకు ఇండియా-సి, ఇండియా-డి జట్ల మధ్య (ఏ గ్రౌండ్)లో, రెండో మ్యాచ్ 12 నుంచి 15వతేదీ వరకు ఇండియా ఏ-ఇండియా డి (ఏ గ్రౌండ్), మూడో మ్యాచ్ 12నుంచి 15వతేదీ వరకు ఇండియా బి-ఇండియా సి (బి గ్రౌండ్), నాలుగో మ్యాచ్ 19 నుంచి 22వరకు ఇండియా ఏ-ఇండియా సి (ఏ గ్రౌండ్), ఐదో మ్యాచ్ ఇండియా బి-ఇండియా డి(బి గ్రౌండ్)లలో పోటీలు జరగనున్నాయి.


రెండో రోజు సాధన చేస్తున్న క్రీడాకారులు

దులీప్‌ట్రోఫీ ఏర్పాట్లు భేష్

అనంత అభిమానం నచ్చింది

ఇండియా సి, డి జట్ల కెప్టెన్లు రుతురాజ్, శ్రేయస్

నేటి నుంచి మొదటి మ్యాచ్


విలేకరుల సమావేశంలో పాల్గొన్న శ్రేయస్ అయ్యర్, రుతురాజ్ గైక్వాడ్

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 4: దులీప్‌ట్రోఫీ నిర్వాహకులు ఏర్పాట్లు చాలా బాగా చేశారని ఇండియా సి, డి జట్ల కెప్టెన్లు రుతురాజ్ గైక్వాడ్, శ్రేయస్ అయ్యర్ పేర్కొన్నారు. దులీప్‌ట్రోఫీకి సంబంధించి బుధవారం స్థానిక అనంత క్రీడాగ్రామంలోని ఆడిటోరియంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. జాతీయ స్థాయిలో అతిపెద్ద క్రికెట్ టోర్నీ దులీప్‌ట్రోఫీ అని తెలిపారు. అలాంటి టోర్నీలో ఆడే అవకాశం లభించడం అదృష్టమన్నారు. ఈటోర్నీలో ప్రతిభ ఆధారంగానే భారత జట్టులో చోటు దక్కుతుందని పేర్కొన్నారు. యువ క్రీడాకారులకు ఇదో మంచి అవకాశమన్నారు. భారత జట్టులో ఉండే ప్రతి క్రీడాకారుడు కచ్చితంగా ఆడాల్సిన టోర్నీ దులీప్ ట్రోఫీ అని అన్నారు. జిల్లాలో నెలకొన్న విభిన్న వాతావరణం అద్భుత అనుభూతి కలిగిస్తున్నట్లు వెల్లడించారు. దులీప్‌ట్రోఫీకి స్టార్ క్రికెటర్ సూర్యకుమార్ యాదవ్ హాజరు కాకపోవడాన్ని ప్రశ్నించగా అది తమ పరిధిలోని అంశం కాదని వివరించారు. రెండు రోజుల పాటు ప్రాక్టీస్ సజావుగా జరిగిందన్నారు. అనంతపురం జిల్లా వాతావరణం, ప్రజల అభిమానం తమకు బాగా నచ్చిందన్నారు. కాగా గురువారం నుంచి నాలుగు రోజుల పాటు ఇండియా-సి, ఇండియా-డి జట్ల మధ్య మ్యాచ్ జరగనున్న విషయం తెలిసిందే.

పది గేట్లు ఎత్తేశారు


క్రస్ట్ గేట్ల నుంచి నదికి వెళుతున్న నీరు


రాయదుర్గం, సెప్టెంబరు 4: తుంగభద్ర జలాశయం నిండటంతో క్రస్ట్ గేట్‌లను ఎత్తి నదికి నీటిని విడుదల చేస్తున్నారు. బోర్డు అధికారులు బుధవారం ఉదయం 10.45 గంటలకు పది క్రస్ట్ గేట్‌లను ఎత్తి 30 వేల క్యూసెక్కులను నదికి వదిలారు. ఎగువ నుంచి 30,419 క్యూసెక్కుల నీరు జలాశయంలోకి చేరుతోంది. డ్యాంకు మొత్తం 33 క్రస్ట్‌గేట్లు ఉన్నాయి. ఇందులో 19వ క్రస్ట్‌గేట్ కొట్టుకుపోవడంతో స్టాప్‌లాగ్ అమర్చారు. మిగిలిన 32 క్రస్ట్ గేట్‌లలో పదింటిని ఒక్కొక్క అడుగు ప్రకారం ఎత్తి నీటిని నదికి వదులుతున్నట్లు బోర్డు అధికారులు తెలిపారు. కాలువల మరో 15 వేల క్యూసెక్కులను వదులుతున్నారు. జలాశయంలో బుధవారం సాయంత్రం 103.260 టీఎంసీల నీటి నిల్వలు నమోదయ్యాయి. ఎగువ నుంచి వరద ఉధృతి పెరుగుతుందన్న అంచనాతో బోర్డు అధికారులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు.

విద్యార్థులకు మళ్లీ పాఠశాల

- ఐదేళ్ల తర్వాత మళ్లీ పుస్తకాల సరఫరా
- బీసీ వసతి గృహాలకు చేరిన బుక్కులు
- పదో తరగతి చదివేవారికి పంపిణీ
- త్వరలో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు...!


బీసీ సంక్షేమశాఖ కార్యాలయంలో పాఠశాల పుస్తకాలు

అనంతపురం ప్రెస్‌క్లబ్, సెప్టెంబరు 4: జిల్లాలోని ప్రభుత్వ బీసీ సంక్షేమ వసతిగృహాల్లోని విద్యార్థులకు 'పాఠశాల' పుస్తకాలు మళ్లీ వచ్చాయి. పదో తరగతి విద్యార్థుల కోసం బయటి మార్కెట్‌లో నెలవారి సిలబస్ మేరకు అన్ని సబ్జెక్టుల్లోని అంశాలను క్రోడీకరించి పాఠశాల పేరుతో ప్రతి నెలా ఓ పుస్తకం విడుదలవుతోంది. ఇది ఎంతో ఉపయోగకరంగా ఉండటంతో గత టీడీపీ పాలనలో అధికారులు సంక్షేమ వసతి గృహ విద్యార్థులకు అందించేవారు. దీన్ని చదివి ఎంతో మంది విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణులయ్యారు. అయితే 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ఈ పుస్తకాల పంపిణీకి మంగళం పాడింది. దీంతో ఎంతో మంది విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. అయితే ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మరోసారి ఈ పాఠశాల పుస్తకాలను హాస్టళ్లకు పంపిణీ చేయడం ప్రారంభించింది. బయటి మార్కెట్‌లో రూ.60లు ఉన్న పుస్తకాన్ని ప్రభుత్వం హాస్టళ్లలోని విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేస్తోంది. ప్రస్తుతం పదో తరగతి విద్యార్థులకు సిలబస్ ప్రకారం ఆగస్టు నెల పాఠశాల పుస్తకాలను అందజేశారు. దీంతో విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



ఇంగ్లిష్ మీడియంలో రూపొందించిన పాఠశాల పుస్తకం

తెలుగు, ఇంగ్లీషులో ముద్రణ...

ప్రభుత్వ వసతిగృహాల్లో వసతి పొందుతున్న పదో తరగతి విద్యార్థుల కోసం 'పాఠశాల' పుస్తకాలను పంపిణీ చేసింది. ఇప్పటికి మూడు నెలల సిలబస్ పూర్తి కావడంతో అందుకనుగుణంగా పరీక్షలు నిర్వహిస్తారు. ఈక్రమంలో రాష్ట్ర ప్రభుత్వం మూడు నెలల సిలబస్‌కు సంబంధించి అన్ని సబ్జెక్టుల సారాంశాలను పాఠశాల పుస్తకంలో నిక్షిప్తం చేసి ముద్రించిన పుస్తకాలను విద్యార్థులకు అందజేసింది. తెలుగు, ఇంగ్లిష్ భాషలలో రెండు రకాల పుస్తకాలను పంపిణీ చేసింది. జిల్లాలోని మూడు డివిజన్లలో పదో తరగతి విద్యార్థులకు దాదాపు 800 పుస్తకాలను పంపిణీ చేసింది. బీసీ సంక్షేమశాఖాధికారులు ఆ పుస్తకాలను సంబంధిత వార్డెన్లకు అందించారు. అయితే ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వసతిగృహాలకు ఇంతవరకూ పుస్తకాలు విడుదల కాలేదు. ఆయా సంక్షేమశాఖల అధికారుల ద్వారా అందిన సమాచారం మేరకు విడతల వారీగా పుస్తకాలు విడుదల అవుతాయి కాబట్టి మలివిడతలో వచ్చే అవకాశం ఉంది. ఇంతవరకు తమకు అందిన పుస్తకాలను డివిజన్ల వారిగా బీసీ సంక్షేమ హాస్టళ్లకు అందించినట్లు బీసీ, ఎస్సీ సంక్షేమ శాఖల డీడీ కుష్బూ కొఠారీ తెలిపారు.

వికసిత్ ఆంధ్రా ప్రణాళికలు రూపొందించాలి

- ఏపీఎంఐపీ పీడీ రఘునాథ్‌రెడ్డి

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 4: వ్యవసాయ, అనుబంధ శాఖలకు సంబంధించి వికసిత్ ఆంధ్రా ప్రణాళికలు పక్కాగా రూపొందించాలని ఏపీఎంఐపీ పీడీ, మాస్టర్ ట్రైనర్ రఘునాథ్‌రెడ్డి సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో వ్యవసాయ, అనుబంధశాఖల అధికారులతో వర్క్‌షాప్ నిర్వహించారు. వ్యవసాయ, అనుబంధ శాఖల పరంగా రాబోవు ఐదేళ్లలో స్థూల ఆదాయం 15 శాతం పెంచేందుకు ప్రస్తుతం చేస్తున్న, చేయనున్న పనులపై ప్రణాళికలు సిద్ధం చేయడంపై అవగాహన కల్పించారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ, ఉద్యాన శాఖ జిల్లా అధికారి నరసింహారావు, పశుసంవర్ధక శాఖ జేడీ వెంకటస్వామి, పట్టు పరిశ్రమ శాఖ జేడీ ఆంజనేయులు, ఏపీఎంఐపీ ఏపీడీ ఫిరోజ్ ఖాన్ పాల్గొన్నారు.

గుంతకల్లు- చిక్కజాజూర్ ప్యాసింజరు రైలు రద్దు

గుంతకల్లు, సెప్టెంబరు 4: గుంతకల్లు- చిక్కజాజూర్-గుంతకల్లు ప్యాసింజరు రైలు నెం(07586/85)ను ఈ నెల 8వ తేదీ నుంచి నెలపాటు రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సౌత్ ఈస్ట్రన్ రైల్వేలోని బిలాస్‌పూర్ రైల్వే డివిజన్‌లో జరుగుతున్న నాన్-ఇంటర్‌లాకింగ్ పనుల కారణంగా గుంతకల్లు-చిక్కజాజూర్ మధ్యన నడిచే ప్యాసింజర్ అప్ అండ్ డౌన్ సర్వీసులను ఈ నెల 8వ తేదీ నుంచి అక్టోబరు 6వ తేదీ వరకూ రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ విషయాన్ని గమనించి ప్రయాణికులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

వరద బాధితులకు సహాయక చర్యలు


వరద బాధితులతో మాట్లాడుతున్న వైకుంఠం ప్రభాకర్ చౌదరి

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 4: విజయవాడ వెస్ట్ నియోజక వర్గ పరిధిలో వరద బాధితులకు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వైకుంఠం ప్రభాకర్ చౌదరి ఆధ్వర్యంలో జిల్లాకు చెందిన పలువురు టీడీపీ నాయకులు సహాయక చర్యలు చేపట్టారు. బుధవారం స్థానిక పలు కాలనీల్లో వరద ప్రభావం, ఉపశమన చర్యలపై ప్రజలను ఆయన అడిగి తెలుసుకున్నారు. తొలుత తాగునీరు, భోజన వసతి కల్పిస్తున్నామన్నారు. గురువారం నుంచి డ్రైనేజీ వ్యవస్థను పునరుద్ధరించి ప్రజలకు అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపడతామన్నారు. రాష్ట్ర నాయకులు దేవళ్ల మురళీ, నటేష్ చౌదరి, నాయకులు గోపాల్ గౌడ్, మారుతీకుమార్ గౌడ్, రామాంజనేయులు, శేఖర్, రంగా, రవి చౌదరి, పరిమి బాబు, సున్నం శ్రీనివాసులు, మహేష్ పాల్గొన్నారు.

శివకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో..


వరద బాధితులకు ఆహారం, తాగునీరు అందిస్తున్న చంద్రదండు ప్రకాష్‌నాయుడు

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 4: విజయవాడ వరద బాధితులకు శివకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు జిల్లాకు చెందిన ఎన్నారై శివకృష్ణ చౌదరి చేయూతనిచ్చారు. బుధవారం రాష్ట్ర మాంసాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ప్రకాష్‌నాయుడు, ట్రస్ట్ సభ్యులు, చంద్రదండు సభ్యులు వరద బాధితులకు ఆహారం, తాగునీరు అందించారు.

విజయవాడకు ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు...


ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లతో ప్రిన్సిపాల్ దివాకర్‌రెడ్డి, పీఓ విష్ణుప్రియ

అనంతపురం సెంట్రల్, సెప్టెంబరు 4: వరద బాధితులకు సేవలందించేందుకు ఆర్ట్స్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు ముందుకు వచ్చారు. బుధవారం ఎన్‌ఎస్‌ఎస్ ఆఫీసర్ విష్ణుప్రియ ఆధ్వర్యంలో వలంటీర్లు భరత్, సంతోష్, అభిషేక్, ప్రకాష్, అర్జున్, అశోక్, చెన్నకేశవ, గణేష్, తిప్పేస్వామి, ధోని విజయవాడ తరలివెళ్లారు. విద్యార్థుల రవాణా, ఇతర ఖర్చులకోసం ప్రిన్సిపాల్ దివాకర్‌రెడ్డి రూ.5వేలు, రియాల్టీ ఎండీ సుబ్రమణ్యం రూ.4వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు.

పారిశుధ్య కార్మికులు...


బస్సులో పారిశుధ్య కార్మికులతో మేయర్, డిప్యూటీమేయర్

అనంతపురం క్రైం, సెప్టెంబరు 4: విజయవాడలో వరద బాధితులకు సేవలు అందించేందుకు అనంతపురం నగరపాలక సంస్థ నుంచి పారిశుధ్య కార్మికులు బయలుదేరి వెళ్లారు. బుధవారం వంద మంది కార్మికులు, 20మంది శానిటరీ సెక్రటరీలు ప్రత్యేక బస్సులో బయలుదేరి వెళ్లారు. మేయర్ మహమ్మద్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్‌రెడ్డి, సాహిత్య వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు నాగభూషణం, ఏటీఎం నాగరాజు పాల్గొన్నారు.

'స్వచ్ఛతా పక్వాడ' పక్షోత్సవాలు

అనంతపురం సెంట్రల్, సెప్టెంబరు 4: ఎస్కేయూ కేంద్రీయ విద్యాలయంలో 'స్వచ్ఛతా పక్వాడ' పక్షోత్సవాలను బుధవారగం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ మార్కండేయులు సూరి ఆధ్వర్యంలో ఆకుతోటపల్లిలో పరిశుభ్రత, అనారోగ్య సమస్యలపై ప్రజలకు విద్యార్థులు అవగాహన కల్పించారు.

విద్యుత్ సమస్యలను పరిష్కరించండి

అనంతపురం రూరల్, సెప్టెంబరు 4: మండలంలోని మన్నీల ఎస్సీ కాలనీలో నెలకొన్న విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని ఆ కాలనీ వాసులు కోరారు. ఈ మేరకు బుధవారం విద్యుత్ శాఖ ప్రధాన కార్యాలయంలో ఎస్ఈకి వినతిపత్రం అందించారు. కాలనీ వాసులు మాట్లాడుతూ కాలనీలో వందకుటుంబాలు జీవనం సాగిస్తున్నాయన్నారు. విద్యుత్ లైన్ సరిగాలేని కారణంగా ఇబ్బందులు పడుతున్నామన్నారు. అధికారులు సమస్య పరిష్కారం అయ్యేవిధంగా చూడాలన్నారు. కాలనీ వాసులు వెంకటరాముడు, పుల్లన్న, సూరి, గోపాల్ పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక

రాప్తాడు, సెప్టెంబరు 4: జ్యోతి మండల సమాఖ్య నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా ప్రసన్నాయపల్లి పంచాయతీ జన్మభూమి నగర్‌కు చెందిన సుశీల, కార్యదర్శిగా స్వప్న, కోశాధికారిగా శివలక్ష్మి, ఉపాధ్యక్షురాలిగా మల్లేశ్వరి, సహాయ కార్యదర్శిగా మణిని వెలుగు ఏపీఎం నల్లప్ప సమక్షంలో ఎంపిక చేశారు. నూతన సభ్యులు సంఘాల బలోపేతం చేయాలన్నారు. అనంతరం సమాఖ్య 20వ వార్షికోత్సవ మహాసభ నిర్వహించారు. సంఘాల్లోని ప్రతి సభ్యురాలు రెండు లేదా మూడు రకాల జీవనోపాధులు ఏర్పాటు చేసుకోవాలన్నారు. డీపీఎం సత్యనారాయణ, ఏజీఎం హనుమేష్, డీపీఎం సత్యనారాయణ, మద్దిలేటి, సీసీ మల్లికార్జున పాల్గొన్నారు.

రేపు మట్టి వినాయక విగ్రహాల తయారీ పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 4: జిల్లా పరిపాలన శాఖ, ఏపీ కాలుష్యనియంత్రణ మండలి, జిల్లా విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 9 గంటలకు ఒకటోరోడ్డులో ఉన్న శారదా మున్సిపల్ ఉన్నత పాఠశాలలో మట్టి వినాయక విగ్రహాల తయారీ పోటీలు నిర్వహించనున్నట్లు ఏపీ కాలుష్యనియంత్రణ మండలి ప్రాంతీయ పర్యావరణ ఇంజనీర్ (ఈఈ) పెద్దిరెడ్డి కిశోర్‌కుమార్‌రెడ్డి తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలల నుంచి 6 నుంచి 10వతరగతి వరకు చదువుతున్న విద్యార్థులు పోటీలకు అర్హులన్నారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత

పావగడ, సెప్టెంబరు 4: పట్టణంలోని వెంకటేశ్వర కాలనీలో బుధవారం ఉదయం తప్పిపోయిన జయకృష్ణ (4)అనే బాలుడి ఆచూకీని పట్టణ ప్రజల సహకారంతో పోలీసులు గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ విషయంపై స్థానిక సీడీపీఓ కార్యాలయంలో మేనేజర్ రకీబ్ మాట్లాడుతూ... అనంతపురం జిల్లా నార్పల గ్రామానికి చెందిన సంహాద్రి, లక్ష్మి దంపతుల కుమారుడు జయకృష్ణ బుధవారం ఉదయం పావగడ పట్టణంలోని ఆఫ్‌బండ వద్ద తల్లిదండ్రుల నుంచి తప్పిపోయాడు. పెనుకొండ మెయినరోడ్డుకు చేరుకుని అక్కడ ఏడుస్తున్నాడు. ప్రమోద్ పెట్రోల్‌బంక్ వారు గమనించి ఆ బాలుడిని ఐసీడీఎస్ అధికారులకు అప్పగించారు. ఈ విషయం సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో జిల్లా కలెక్టర్ శుభ కళ్యాణి సంబంధిత అధికారులకు, పోలీసులకు సమాచారం అందించి అప్రమత్తం చేశారు. ఈ నేపథ్యంలో అధికారులు, పోలీసులు చొరవ తీసుకుని పట్టణ ప్రజల సహకారంతో బాలుడిని పోలీస్‌స్టేషన్‌లో తల్లిదండ్రులకు అప్పగించారు. ఏసీడీపీఓ విజయలక్ష్మి, అంగనవాడీ సూపర్‌వైజర్ సుశీలమ్మ, కార్యకర్త శంకుతలమ్మ, శంకర ఉన్నారు.


బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించిన సీడీపీఓ, పోలీసులు

ఉండలేకున్నాం..!

- బాలికల వసతి గృహంలో సమస్యల తిష్ట
- గదుల్లో కుంగిన బండలు
- ఆవరణలో ఏపుగా పెరిగిన ముళ్లకంపలు
- భయాందోళనలో బాలికలు


ఒక వైపు ప్రహరీ లేని దృశ్యం

రాప్తాడు, సెప్టెంబరు 4: బాలికల వసతి గృహంలో ఉండలేకున్నాం. వరండాల్లో ఫ్లోర్ బండలు కుంగిపోయాయి. నిత్యం అందులోంచి జెర్రిలు వస్తున్నాయి. బాత్‌రూంకు తలుపులు లేవు. కొన్నివాటికి గొళ్లాలు లేవు. వసతి గృహానికి మూడువైపులా ప్రహరీ ఉన్నా, ఓ వైపు లేదు. దీంతో ఎప్పుడు ఏమి జరుగుతుందోనని బాలికలు ఆందోళనలు చెంతుతున్నారు. వసతి గృహంలోకికి విష సర్పాలు రావడంతో బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నాం. వసతిగృహం ఆవరణలో ముళ్ల కంపలు ఏపుగా పెరిగాయి. ఇన్ని సమస్యలున్నా అధికారులు పట్టించుకోలేదని బాలికలు, వారి తల్లితండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాప్తాడు సమీపంలోని పంగల్‌రోడ్డు వద్ద ఆదర్శ పాఠశాల పక్కనే ప్రభుత్వ బాలికల వసతి గృహం ఉంది. 9, 10వ తరగతి, ఇంటర్ మెదటి సంవత్సరం, ద్వితీయ సంవత్సరం బాలికలు దాదాపు 100 మంది ఉంటున్నారు. రెండు ఫ్లోర్లలో


ఆవరణలో పెరిగిన ముళ్ల కంపలు


వసతి గృహంలో కుంగిన బండలు

గదులు ఉన్నాయి. కింద ఫ్లోర్లో బాలికలు ఉండే గదుల్లో బండలు కుంగిపోయి మట్టి కనబడుతోంది. వంట గదిలో కూడా బండలు కుంగిపోయాయి. వసతి గృహానికి ఒక వైపు ప్రహరీ లేదు. ఆవరణలో ముళ్ల కంపలు విపరీతంగా పెరిగిపోయాయి. ముళ్ల కంపల్లో విష సర్పాలు, జెర్రిలు రంధ్రాల్లో నుంచి కుంగిన బండల సందుల్లో గదుల్లోకి వస్తున్నాయని బాలికలు చెబుతున్నారు. రెండు, మూడు సార్లు విష సర్పాలు వసతి గృహంలోకి వచ్చాయని బాలికలు వాపోతున్నారు. ఒక గదిలో నిర్మించిన బాత్‌రూం శిథిలావస్థకు చేరుకుంది.

ఏపుగా పెరిగిన ముళ్ల కంపలు

ఆదర్శ పాఠశాల బాలికల వసతి గృహానికి మూడు వైపులా ప్రహరీ ఉంది. ఒక వైపు లేదు. దీంతో బయట నుంచి పురుగులు, విషసర్పాలు లోపలికి వస్తున్నాయి. ప్రహరీ ఆవరణలో ముళ్ల కంపలు ఏపుగా పెరిగాయి. మురుగు నీరు కూడా నిల్వ ఉండటంతో అపరిశుభ్రతకు నిలయంగా మారింది. సకాలంలో ముళ్ల కంపలు తొలగించకపోవడంతోనే సమస్య అధికమైంది. మరుగుదొడ్ల గదులకు కొన్నింటికి డోర్‌లు, గెడెలు సక్రమంగా లేవు.

బండలు కుంగిపోయాయి



వసతి గృహంలో బండలు కుంగిపోయి రంధ్రాలు ఏర్పడ్డాయి. గదుల బయట నుంచి ఎలుకలు, కొక్కులు తోడటంతో రంధ్రాల్లో నుంచి జెర్రిలు వస్తున్నాయి.
- అరుణ ఇంటర్ ద్వితీయ సంవత్సరం

భయపడుతున్నాం



గదుల్లో బండలు కుంగిపోవడంతో రంధ్రాల్లో నుంచి ఏం వస్తాయో ఏమో అని అందరూ బయపడుతున్నారు. అధికారులు పరిశీలించి సమస్య పరిష్కరించాలి.
- కుసుమ ఇంటర్ ద్వితీయ సంవత్సరం

ఉన్నతాధికారులకు వివరిస్తాం: మల్లికార్జున ఎంఈఓ రాప్తాడు
బాలికల వసతి గృహంలోని సమస్యలను ఉన్నతాధికారులకు వివరించి వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం.

కేజీబీవీకి సీలింగ్ ఫ్యాన్ల వితరణ

శింగనమల, సెప్టెంబరు 4: స్థానిక కేజీబీవీకి విద్యాకమిటీ చైర్‌పర్సన్ పెద్దక్క 10 సీలింగ్ ఫ్యాన్లు వితరణ చేశారు. బుధవారం పాఠశాలలో ఎంఈఓలు నరసింహరాజు, శివప్రసాద్, ఎస్‌ఓ గీతారాణికి చైర్‌పర్సన్ ఫ్యాన్లు అందించారు. నాగరాజు, మధుయాదవ్ కేజీబీవీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సోషల్ ఆడిట్

అనంతపురంరూరల్, సెప్టెంబరు 4: మండలంలోని గ్రామాల్లో జరిగిన ఉపాధి పనులపై 8వ తేదీ నుంచి గ్రామస్థాయిలో సోషల్ ఆడిట్ నిర్వహిస్తున్నట్లు ఏపీఓ చంద్రకళ తెలిపారు. ఆమేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 8 నుంచి గ్రామాల్లోని సచివాలయాలు, పంచాయతీ కార్యాలయాల్లో నాలుగు రోజులు కార్యక్రమం జరుగుతుందన్నారు. 13న మండలంలో సోషల్ ఆడిట్ ఉంటుందన్నారు.

శ్మశానవాటికను కబ్జా చేస్తున్నా పట్టించుకోరా?

చెన్నేకొత్తపల్లి, సెప్టెంబరు 4: మండలంలోని బసంపల్లి గ్రామంలో ఎస్సీ(మాల)కు చెందిన శ్మశాన వాటికను కబ్జా చేస్తున్న వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఎస్సీఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకేహరి ప్రశ్నించారు. బుధవారం బసంపల్లి ఎస్సీ కాలనీ వాసులతో కలిసి ఇన్‌చార్జి తహసీల్దార్ అనూరాధకు సమస్యను వివరించారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ బసంపల్లి గ్రామంలో సర్వేనెంబరు 17-1ఏలో 80 ఏళ్లగా శ్మశానవాటిక మాలలకు ఉందన్నారు. అదే గ్రామానికి చెందిన బీసీ కులస్థులు కొందరు దౌర్జన్యంగా ఆక్రమించుకుని సమాధులను ధ్వంసం చేశారన్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదుచేసినా కేసు నమోదు చేయలేదన్నారు. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించాలని కోరారు. గంగులయ్య, మల్లికార్జున, రామాంజనేయులు, రామకృష్ణ, గోపాల్ పాల్గొన్నారు.

అల్లూరి ఉద్యమస్ఫూర్తి అందరికీ ఆదర్శం


అల్లూరి వర్ధంతి సభలో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

అనంతపురం సెంట్రల్, సెప్టంబరు 4: ప్రజా సమస్యల పోరాటానికి స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు ఉద్యమ స్ఫూర్తి విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని శ్రీసాయి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దామోదరరెడ్డి సూచించారు. అల్లూరి శత వర్ధంతిని పురస్కరించుకుని కళాశాలలో బుధవారం సదస్సును నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు గోవిందరాజు, తబ్రేజ్ ఖాన్, కళాశాల చైర్మన్ రాజేంద్రప్రసాద్, ప్రిన్సిపాల్ దామోదర్‌రెడ్డి అల్లూరి చిత్రపటానికి నివాళులర్పించారు. అధ్యాపకులు హబీబుద్దీన్, షేక్షావలి, మహీధర్, మాధవి పాల్గొన్నారు.

విపత్తు వేళ రాజకీయాలు చేయడం దుర్మార్గం

● జగన్‌పై ఎమ్మెల్యే దగ్గుపాటి ఫైర్

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 4: వరదలతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే.. విపత్తు వేళ వైసీపీ అధినేత జగన్ రాజకీయాలు చేయడం దుర్మార్గమని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. వరదల నేపథ్యంలో సీఎం చంద్రబాబు, మంత్రులు, అధికార యంత్రాంగం రేయింబవళ్లు శ్రమిస్తున్నారన్నారు. ఆపదలోని ప్రజలను ఆదుకునేందుకు అన్ని వర్గాల ప్రజలు ముందుకొస్తుంటే వైసీపీ నాయకులు మాత్రం రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు.

వినాయకచవితిని ప్రశాంతంగా జరుపుకోవాలి

ధర్మవరం రూరల్(కనగానపల్లి), సెప్టెంబరు 4: వినాయకచవితి పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని కనగానపల్లి ఎస్‌ఐ మల్లికార్జున రెడ్డి నిర్వాహకులకు సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో బుధవారం వివిధ గ్రామాల వినాయకచవితి ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశమయ్యారు. నిబంధనల మేరకు ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని ఉత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకున్నా సభ్యులదే బాధ్యత వహించాలన్నారు. గ్రామాల్లో ఏర్పాటుచేసే వినాయక మంటపాలకు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు.

10న జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 4: జిల్లాస్థాయి అథ్లెటిక్స్ క్రీడాకారుల ఎంపిక పోటీలు 10వ తేదీన నీలం సంజీవరెడ్డి పీటీసీ మైదానంలో ఉదయం 7గంటలకు నిర్వహించనున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అడ్‌హాక్ కమిటీ చైర్మన్ ఇస్మాయిల్, వైస్ చైర్మన్‌లు రవికుమార్, సుదర్శన్ తెలిపారు. అండర్-14, 16, 18, 23 విభాగాలలో బాల, బాలికల క్యాటగిరిలో క్రీడాకారుల ఎంపిక పోటీలు ఉంటాయాన్నరు. ఎంపికైన క్రీడాకారులు 14వ తేదీన నుంచి గుంటూరులో నిర్వహించే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ప్రాతినిథ్యం వహిస్తారని తెలిపారు. ఆసక్తి, అర్హతగల క్రీడాకారులు జనన ధృవీకరణ పత్రం, ఆధార్‌కార్డు, యునిఫాంతో హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాలకు 9052288643 నంబరును సంప్రదించాలని కోరారు.

ప్రశాంతతకు భంగం వాటిల్లితే చర్యలు

గార్లదిన్నె సెప్టెంబరు 4: గ్రామాల్లో ప్రశాంతతకు భంగం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని శింగనమల సర్కిల్ సీఐ కౌలుట్లయ్య హెచ్చరించారు. బుధవారం రాత్రి కల్లూరు గ్రామంలో సీఐ ఎస్‌ఐ మహమ్మద్‌గౌస్‌తో కలసి గ్రామస్థులతో గ్రామసభ నిర్వహించారు సీఐ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి ఒక్కరూ కలసిమెలసి ఉండాలని, వినాయకచవితిని ప్రశాంతంగా నిర్వహించుకోవాలని సూచించారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

రాప్తాడు, సెప్టెంబరు 4: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగరత్న తెలిపారు. సెప్టెంబరు 30 వరకూ పౌష్టికాహార మాసోత్సవాలలో భాగంగా బుధవారం మండలంలోని గొందిరెడ్డిపల్లిలో అంగన్‌వాడీ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు సకాలంలో పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ఆరోగ్య సూత్రాలు తప్పక పాటించాలన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

● మలేరియా అధికారి లక్ష్మానాయక్

అనంతపురం టౌన్, సెప్టెంబరు 4: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉంటూ ముందస్తు చర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బందికి జోనల్ మలేరియా అధికారి డాక్టర్ లక్ష్మానాయక్ ఆదేశించారు. బుధవారం ఆయన జిల్లాకురాగా నగరంలోని వివిధ ప్రాంతాలలో పర్యటిస్తూ పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాలను పరిశీలించారు. నీరు నిల్వ, దోమలు పెరగడానికి కారణమైన లార్వా తదితర వాటిని స్వయంగా పరిశీలించారు. అనంతరం జిల్లావైద్యశాఖ కార్యాలయంటో డీఎంఓ విభాగంతో సమావేశం నిర్వహించి చేపడుతున్న కార్యక్రమాలపై ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ ఈ సీజన్‌లో మలేరియా, డెంగీ, చికున్ గున్యా వ్యాపించే అవకాశం ఉందన్నారు. ఈ వ్యాధులు ప్రబలడానికి దోమలేకారణమని ఆ దోమలు విజృంభించకుండా ఉండాలంటే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలనిదీనిపై ప్రజలకు అవగాహన


వైద్యసిబ్బందికి సూచనలు ఇస్తున్న లక్ష్మానాయక్

కల్పించాలన్నారు. దోమల వల్లవచ్చే జబ్బుల గురించి సరైన అవగాహన ప్రజలలో వచ్చినపుడే ప్రజల ఆరోగ్యం బాగుపడుతుందన్నారు. జోనల్ అసిస్టెంట్ డైరెక్టర్ త్యాగరాజు, డీఎం ఓబులు, అసిస్టెంట్ డీఎంఓ సత్యనారాయణ, ఆరోగ్యవిస్తరణాధికారి నిత్యపూజయ్య, మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్ మద్దయ్య, నూర్‌బాషా, శ్రీధర్ పాల్గొన్నారు.

9 నుంచి గ్రామ, మండల కార్యాలయాల వద్ద నిరసనలు

● ఏపీ రైతుసంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి


మాట్లాడుతున్న చంద్రశేఖర్‌రెడ్డి

అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 4: జిల్లాలో 2023 ఖరీఫ్, రబీ ఇన్సురెన్స్ ప్రకటించాలని ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో 9 నుంచి 23వ తేదీ వరకు గ్రామ, మండల కార్యాలయాల వద్ద నిరసనలు చేపట్టనున్నట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక గణేనాయక్ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖరీఫ్, రబీలో తీవ్రమైన కరువు పరిస్థితులేర్పడ్డాయని, సకాలంలో వర్షాలు రాక వేరుశనగ, శనగ, మిరప, పత్తి తదితర పంటలు పూర్తిగా నష్టం వాటిల్లిందన్నారు. కనీసం పెట్టుబడులు కూడా రాక, చేసిన అప్పులు ఎలా కట్టాలో తెలియక అన్నదాతలు దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారన్నారు. తక్షణమే ప్రత్యేక నిధులు కేటాయించి, ప్రభుత్వం ప్రకటించిన పెట్టుబడి సాయాన్ని వెంటనే రైతుల ఖాతాల్లో జమచేయాలన్నారు. 25వ తేదీన కలెక్టరేట్ ముందు చేపట్టే ధర్నా కార్యక్రమాల్లో రైతులు, కూలీలు, కౌలు రైతులు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు తరిమెల నాగరాజు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో శివారెడ్డి, విరూపాక్షి, రాజారాంరెడ్డి, శ్రీనివాసులు, నల్లప్ప, సంగప్ప, పోతులయ్య, చిదంబరయ్య, వెంకటకొండ పాల్గొన్నారు.

ఐఏబీ సమావేశం నిర్వహించాలి

అనంతపురం క్లాక్‌టవర్: ఇరిగేషన్ అడ్వైజరీ బోర్డు(ఐఏబీ) సమావేశం వెంటనే నిర్వహించి, నీటిని విడుదల చేయాలని ఏపీ రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిరుతల మల్లికార్జున ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆ సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ టీబీ డ్యాంలో పూర్తిస్థాయిలో నీరు నిల్వ ఉండడంతో హెచ్చెల్సీకి నీటిని వదులుతున్నారని, దీంతో ఆయకట్టు రైతులు వివిధ పంటలు సాగుచేశారన్నారు. వెంటనే ఐఏబీ సమావేశం నిర్వహించి జిల్లాలో సాగుచేసిన ఆయకట్టు రైతుల పంటను కాపాడాలని కోరారు.

అత్యాచారాల నిర్మూలనకు చర్యలు చేపట్టాలి

● ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి


మాట్లాడుతున్న రమాదేవి

అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 4: రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, దాడుల నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి డిమాండ్ చేశారు. బుధవారం కేఎస్ఎన్ ప్రభుత్వ బాలికల డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో ఐద్వా ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. దేశంలో మహిళలపై రోజురోజుకీ హత్యాచారాలు, దాడులు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వీటిని అరికట్టాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంఘటన జరిగినప్పుడు హడావిడి చేయడం తప్ప శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టడంలో అలసత్వం వహిస్తున్నాయని విమర్శించారు. కోల్‌కతాలో వైద్య విద్యార్థిని పట్ల జరిగిన దారుణ ఘటన దేశాన్ని కుదిపేసిందన్నారు. కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి, ఉమెన్ కోఆర్డినేషన్ కమిటీ సభ్యురాలు బృంద, విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ, డాక్టర్ ప్రసూన, అధ్యాపకులు రాజగోపాల్, అరుణ, మహిళా సంఘం నాయకురాలు కుమారి, శ్యామల, చంద్రిక, ఓతూరు పరమేష్ పాల్గొన్నారు.

జాతి నిర్మాణంలో గురువు పాత్ర కీలకం


సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 4: జాతి నిర్మాణంలో గురువు పాత్ర కీలకమని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఎస్‌ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం సెంట్రల్ యూనివర్సిటీలో జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సెంట్రల్ యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ ఎస్‌ఏ కోరి మాట్లాడుతూ ప్రపంచంలో అన్ని వృత్తులలో ఉపాధ్యాయ గురువు వృత్తి ఎంతో గొప్పదని పేర్కొన్నారు. అనంతరం వీసీ, డీన్ షీలారెడ్డి, ఆచార్యులు రామ్ రెడ్డి, హనుమ కెన్నెడీ, రాజేంద్ర ప్రసాద్, గరికపాటి గురజాడలను సన్మానించారు. ఎస్‌ఎస్‌బీఎన్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ రమేష్ నారాయణ, జాతీయ యువజన అవార్డు గ్రహీత బిసాటి భరత్, ఎస్‌ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపకులు సుంకర రమేష్, రాష్ట్రపతి అవార్డు గ్రహీతలు జీవన్‌కుమార్, జయమారుతి, సభ్యులు పాల్గొన్నారు.

అర్చకులకు జీతాలు పెంచింది కూటమి ప్రభుత్వమే


పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, ద్విసభ్య కమిటీ సభ్యులు

శింగనమల, సెప్టెంబరు 4: రాష్ట్రంలోని దేవాలయల్లో పనిచేస్తున్న అర్చకులకు జీతాలు పెంచి ఆదుకున్నది కూటమి ప్రభుత్వమే అని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అన్నారు. బుధవారం మండలంలోని శివపురం పెద్దమ్మగుడిలో ఎమ్మెల్యేతో పాటు ద్వీసభ్యకమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి హాజరయ్యారు. పెద్దమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. ఆలంవెంకటనరసానాయుడు, మారుతీనాయుడు. జీసీ బాబు పాల్గొన్నారు.

ఎరా స్కూల్‌లో ఇన్వెస్టిట్యూర్ సెర్మనీ

అనంతపురంరూరల్, సెప్టెంబరు 4: మండలంలోని రాచానపల్లి సమీపంలో ఉన్న ఎరా ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఇన్వెస్టిట్యూర్ సెర్మనీని బుధవారం నిర్వహించారు. కళాశాల అధినేత సుశీలా రెడ్డి, చైర్మన్ అరుణ్‌కుమార్‌రెడ్డి, నరేంద్ర రెడ్డి, ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి హాజరయ్యారు. చైర్మన్ అరుణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ పాఠశాలస్థాయి నుంచే విద్యార్థులకు నాయకత్వ లక్షణాలు అలవాటు చేసుకోవాలన్నారు. విద్యార్థుల హెడ్ బాయ్, హెడ్ గర్ల్, తదితర విభాగాల్లో ఎన్నికైన వారికి వారి బాధ్యతలు ఏవిధంగా నిర్వహించాలో తెలియజేయాలన్నారు.

ఉచిత వైద్య శిబిరం

అనంతపురం సెంట్రల్, సెప్టంబరు 4: ఎల్ఐసీ వారోత్సావాల్లో భాగంగా బళ్లారి రోడ్డులోని బ్రాంచ్-2 కార్యాలయ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. బ్రాంచ్ మేనేజర్ మమత మాట్లాడుతూ జీవిత బీమాతో ప్రజలకు సేవలందిస్తున్న ఎల్ఐసీ సంస్థ. పేద విద్యార్థినులకు ఉచిత స్కాలర్‌షిప్‌ను అందజేస్తున్నట్లు తెలిపారు. అనంతరం రక్త గ్రూపు నిర్ధారణ, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. ఏజెంట్ల సంఘం ప్రధాన కార్యదర్శి చెరుకుతోట జగదీష్, నాగరాజు, వెంకటేష్, రతన్‌లాల్, హరి, రామ్లానాయక్ పాల్గొన్నారు.

పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలి: సీపీఐ

రాప్తాడు, సెప్టెంబరు 4: పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. సీపీఐ జాతీయ సమితి పిలుపులో భాగంగా నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని బుధవారం రాప్తాడు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ విజయకుమారికి వినతిపత్రం అందచేశారు.

నల్లబ్యాడ్జీలతో మద్యం షాపు సిబ్బంది నిరసన

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 4: జిల్లాలోని ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న సిబ్బంది బుధవారం నల్లబ్యాడ్జీలు ధరించి విధులు నిర్వర్తిస్తూ నిరసన తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 192 ప్రభుత్వ మద్యం దుకాణాల్లోని సిబ్బంది నిరసనలో పాల్గొన్నారు. ఏపీ స్టేట్ బెవరేజెస్ కార్పొరేషన్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరెడ్డి, నాయకులు హరీష్‌కుమార్, మహేంద్ర, మహేష్ మాట్లాడుతూ... ప్రభుత్వ మద్యం దుకాణాల్లో విధులు నిర్వర్తిస్తున్న సేల్స్‌మెన్స్, సూపర్‌వైజర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. 7వ తేదీ నిర్వహించాల్సిన మద్యం దుకాణాల బంద్ కార్యక్రమాన్ని వరదల కారణంగా వాయిదా వేశామన్నారు. త్వరలోనే బంద్ కార్యక్రమం ఎప్పుడు ఉంటుందో తెలుపుతామన్నారు. సాయినాథ్‌రెడ్డి, రమేష్, దివాకర్, రామకృష్ణ, వేణుగోపాల్‌రెడ్డి, సాయికుమార్, నరసింహరాజు పాల్గొన్నారు.

14వ రోజుకు చేరిన తాగునీటి కార్మికుల సమ్మె


ర్యాలీ చేస్తున్న తాగునీటి కార్మికులు

గార్లదిన్నె, సెప్టెంబరు 4: బకాయి వేతనాలు చెల్లించాలని సత్యసాయి తాగునీటి కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారానికి 14వ రోజుకు చేరింది. కల్లూరులో స్టేట్ బ్యాంకు నుంచి నీలం సంజీవరెడ్డి సర్కిల్లో కార్మికులు ర్యాలీ చేపట్టారు. వారు మాట్లాడుతూ సమ్యలు పరిష్కరించాలని సమ్మె చేస్తున్నా సంబంధిత అధికారులు స్పందించక పోవడం బాధాకరమన్నారు. అధికారులు స్పందించి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నాగభూషణం, మల్లరాయుడు, సాంబశివ, శ్రీనివాసులు, శంకర్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సమ్మెకు సీపీఎం మద్దతు

అనంతపురం కల్చరల్: జిల్లాలోని వాటర్ సప్లయ్ కార్మికుల బకాయి వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ చెల్లించాలని డిమాండ్ చేస్తూ కార్మికులు గురువారం నుంచి చేపట్టనున్న నిరవధిక సమ్మెకు సీపీఎం సంపూర్ణ మద్దతునిస్తోందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో శ్రీరామిరెడ్డి, సత్యసాయి వాటర్ సప్లయ్ స్కీమ్‌లద్వారా వేలాది గ్రామాలకు 20 సంవత్సరాలుగా కార్మికులు నీటి సరఫరా చేస్తున్నారన్నారు. కార్మికులకు నెలల తరబడి వేతనాలివ్వకపోవడం వల్ల వారి కుటుంబాలు అప్పుల్లో కూరుకుపోయాయన్నారు. కార్మికులు సమ్మెబాట పడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు.

చిన్నారులపై వీధి కుక్క దాడి

తాడిపత్రి, సెప్టెంబరు 4: చిన్నపొలమడ గ్రామంలో ఆడుకుంటున్న చిన్నారులపై బుధవారం ఓ వీధి కుక్క దాడి చేసింది. మనోజ్‌కుమార్, తన్వీష్, కౌశికొరెడ్డితోపాటు మరో ఇద్దరు చిన్నారులను విచక్షణారహితంగా కరిచింది. స్థానికులు అప్రమత్తమై కుక్కను తరిమికొట్టారు. చికిత్స నిమిత్తం చిన్నారులను తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మనోజ్ కుమార్‌కు తీవ్రగాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు.

ప్రశాంతంగా ప్రవేశ పరీక్ష

ఉరవకొండ, సెప్టెంబరు 4: పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 6, 8వ తరగతులలో అదనపు సీట్ల భర్తీ కోసం బుధవారం ప్రవేశపరీక్ష నిర్వహించారు. 8వతరగతిలో ఒక అదనపు సీటుకు 15మంది విద్యార్థులు హాజరయ్యారు. 6వ తరగతిలో 5సీట్లకు 83మంది హాజరయ్యారు. పరీక్షలను అబ్జర్వర్ రజాక్ పర్యవేక్షించారు.

ట్రాక్టర్ మంజూరు

ఉరవకొండ, సెప్టెంబరు 4: వజ్రకరూరు మండలంలోని పీసీ ప్యాపిలి పంచాయతీకి స్వచ్ఛ మిషన్‌లో భాగం గా ట్రాక్టర్ మంజూరైంది. దానిని టీడీపీ నాయకుడు నాగేంద్ర బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్లీన్ ఏపీ, చంద్రన్న స్వచ్ఛ సంకల్పంలో భాగంగా ప్రభుత్వం ఈ ట్రాక్టర్‌ను మంజూరు చేసిందని తెలిపారు. మాజీ ఎంపీటీసీ నాగన్న, టీఎన్ఎస్ఎఫ్ నాయకుడు సుధాకర్ పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

ఉరవకొండ, సెప్టెంబరు 4: అంగన్‌వాడీ భవనాన్ని కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు ఐసీడీఎస్ పీడీ శ్రీదేవిని కోరారు. వజ్రకరూరు మండలంలోని వెంకటాంపల్లి తండాలో 2020వ సంవత్సరంలో కూల్చివేతకు గురైన అంగన్‌వాడీ భవనం స్థలాన్ని ఐసీడీఎస్ పీడీ బుధవారం పరిశీలించారు. గ్రామస్థులు ఆమెతో మాట్లాడుతూ పాత అంగన్‌వాడీ భవనానికి మరమ్మతులు చేసి ఉంటే సరిపోయేదని, కాగా కొంతమంది అధికారులు గత వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ నాయకులతో చేతులు కలిపి స్వలాభం కోసం పడగొట్టారని తెలిపారు. భవనానికి సంబంధించిన సామగ్రిని కూడా భద్రపరచకుండా దుర్వినియోగం చేశారన్నారు. చేయని పనులకు నిధులు డ్రా చేసి వాడుకున్నారని చెప్పారు. అంగన్ వాడీ భవనాన్ని కూల్చివేసిన వారిపై చర్యలు తీసుకుంటామని పీడీ తెలిపారు. కార్యక్రమంలో బంజారా సంఘం నాయకులు కేశవనాయక్, మాజీ జడ్పీటీసీ తులసీదాస్ నాయక్ పాల్గొన్నారు.

టూటౌన్ సీఐ బాధ్యతల స్వీకరణ

గుంతకల్లుటౌన్, సెప్టెంబరు 4: పట్టణంలోని టూటౌన్ సీఐగా పీఏ మస్తాన్ బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న గణేష్‌ను అనంతపురం వీఆర్‌కు బదిలీ చేశారు. కడప ఎస్సీఎస్టీ సెల్‌లో సీఐగా పనిచేస్తున్న ఏపీ మస్తాన్‌కు గుంతకల్లు టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. ఉదయం బాధ్యతలను స్వీకరించిన సీఐ మస్తాన్‌కు సిబ్బంది పుష్పగుచ్ఛాలను అందిజేసి శుభాకాంక్షలను తెలిపారు.

రూరల్ ఎస్ఐగా రాఘవేంద్రప్ప

గుంతకల్లు రూరల్ ఎస్ఐగా రాఘవేంద్రప్ప బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ సురేష్‌ను గుత్తికి బదిలీ చేశారు. ఉరవకొండలో పనిచేస్తున్న రాఘవేంద్రప్పను గుంతకల్లు రూరల్ ఎస్ఐగా బదిలీ చేశారు.

బాధ్యతలు స్వీకరించిన సీఐ రామసుబ్బయ్య

పెద్దవడుగూరు, సెప్టెంబరు 4: మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో బుధవారం నూతన సీఐగా రామసుబ్బయ్య బాధ్యతలు స్వీకరించారు. ఆయన గుంతకల్లు నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతలు కాపాడేందుకు శక్తివంచన లేకుండా కృషిచేస్తానని తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ఉరవకొండ, సెప్టెంబరు4: వజ్రకరూరు మండలంలోని బొడిసానిపల్లి గ్రామంలో మిద్దె కూలడంతో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఉదయ్‌కిరణ్(21)అనే యువకుడు మృతి చెందాడు. గత నెల 23వ తేదీన గ్రామంలో మిద్దె కూలి నలుగురు గాయపడిన విషయం తెలిసిందే. అందులో ఉదయ్‌కిరణ్ అనంతపురం ఆస్పత్రిలో గత 12 రోజులుగా చికిత్స పొందుతూ.. మంగళవారం రాత్రి మృతి చెందాడు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు.

రోడ్డు ప్రమాదంలో టీడీపీ కార్యకర్త మృతి

కళ్యాణదుర్గం, సెప్టెంబరు 4 : పట్టణానికి చెందిన టీడీపీ కార్యకర్త తలారి తిమ్మరాజు (50) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణంలో విద్యానగర్‌లో నివాసం ఉంటున్న తిమ్మరాజు బుధవారం సాయంత్రం తన నివాసం నుంచి బైక్‌లో పట్టణంలోకి బయలుదేరాడు. కొద్దిదూరం వెళ్లగానే ఎదురుగా మరో ద్విచక్రవాహనం వేగంగా వచ్చి ఢీకొంది. ప్రమాదంలో తిమ్మరాజు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే స్థానిక ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అనంతరం మెరుగైన వైద్య కోసం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడికి భార్య మారెక్క, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి ఆత్మహత్య

బెళుగుప్ప, సెప్టెంబరు 4 : మండలంలోని దుద్దేకుంట గ్రామంలో యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏఎస్ఐ రామదాసు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన యువకుడు మర్రిస్వామి (20) కొన్ని నెలలుగా మూర్ఛవ్యాధితో బాధపడుతున్నాడు. పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందినా నాయం కాలేదు. దీంతో జీవితంపై విరక్తి చెందిన అతను మంగళవారం రాత్రి గ్రామ శివారులో చెట్టుకు ఉరి వేసుకున్నాడు. మృతుడి తండ్రి రామాం జనేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

తాడిపత్రి, సెప్టెంబరు 4: మండలంలోని సజ్జల దిన్నె వంక నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను బుధవారం సీజ్‌చేశామని రూరల్ పోలీసులు తెలిపారు. అందిన సమాచారం మేరకు సిబ్బందితో దాడులు చేసి డ్రైవర్లు యల్లప్ప, మల్లికార్జునలను అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

అభయ ఫౌండేషన్‌కు విరాళం

కళ్యాణదుర్గం, సెప్టెంబరు 4: యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు గాను పట్టణంలోని మార్కెట్‌యార్డులో ఉన్న అభయ ఫౌండేషన్‌కు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు తన మొదటి నెల వేతనాన్ని విరాళంగా ఇచ్చారు. ఆ మొత్తానికి సంబంధించిన చెక్కును ఎమ్మెల్యే మేనల్లుడు దేవినేని ధర్మతేజ బుధవారం ఆ ఫౌండేషన్ నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని యువతకు శిక్షణ ఇచ్చి స్వయం ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ఫౌండేషన్ ద్వారా యువతకు డ్రైవింగ్, టైలరింగ్, మొబైల్ రిపేరీ, బ్యూటీషియన్ మొదలగు వాటిపై ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.

మున్సిపాలిటీని అభివృద్ధి చేస్తా : ఎమ్మెల్యే

గుంతకల్లుటౌన్, సెప్టెంబరు4: గుంతకల్లు మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో నడిపిస్తానని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో బుధవారం స్టాండింగ్ కౌన్సిల్ బీఎస్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ కౌన్సిలర్లకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మున్సిపాలిటీ అభివృద్ధికి నోచుకోలేదన్నారు. ప్రతి వార్డులో నెలకొన్న సమస్యలను త్వరతగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఎమ్మెల్యేకు, ఆయన సోదరుడు గుమ్మనూరు నారాయణస్వామికి, పలువురు కౌన్సిలర్లకు మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ బీఎస్ కృష్ణారెడ్డి పూలమాలు, శాలువాలతో సన్మానం చేశారు. తర్వాత మున్సిపల్ కార్యాలయం వద్ద హరిహర గో సంరక్షణ సేవా సమితి ఆధ్వర్యంలో గోమయం, మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాలను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతిఒక్కరూ గోమయం, మట్టితో చేసిన విగ్రహాలను పూజించాలన్నారు. అనంతరం పాతగుంతకల్లులోని వాల్మీకి కల్యాణ మండపంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాల్లోనూ ఆయన


గోమయంతో తయారు చేసిన వినాయక విగ్రహాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

పాల్గొన్నారు. గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు. అనంతరం పుసుపు కుంకుమ కింద గర్భిణులకు ఒక్కొక్కరికి రూ.500లు ఇచ్చారు. ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ లావణ్య, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, సీడీపీఓ ఢిల్లీశ్వరి, అసిస్టెంట్ సీడీపీఓ నాగమణి, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు, టీడీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల ఉత్పత్తులను ప్రోత్సహిస్తాం: కలెక్టర్

కూడేరు, సెప్టెంబరు 4 : చిరుధాన్యాలతో తయారు చేసే ఉత్పత్తులను మార్కెటింగ్ చేయాలని, అందుకు ప్రోత్సహిస్తామని కలెక్టర్ వినోద్ కుమార్ పేర్కొన్నారు. మండలంలోని ముద్దలాపురం గ్రామ వద్దనున్న రైతు నేస్తం ఫుడ్ ప్రాసెసింగ్ కంపెనీని బుధవారం ఆయన తనిఖీ


ఉత్పత్తులను పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

చేశారు. ఈ సందర్భంగా అక్కడ తయారు చేస్తున్న బిస్కెట్లు, చిక్కీలు తదితర ఆహార పదార్థాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఈ నెల 5 నుంచి 22వ తేదీ వరకు అనంతపురం పట్టణంలోని ఆర్డీటీ స్టేడియంలో దులీప్ ట్రోఫీ క్రికెట్ జరగనుందని, ఆ సమయంలో అక్కడ ఈ ఉత్పత్తులను విక్రయాలు జరుపుకోవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో ఏ ఎఫ్ ఎకాలజీ డైరెక్టర్ మల్లారెడ్డి, రైతు నేస్తం ఫుడ్ ప్రాసెసింగ్ సీఈఓ మురళీకృష్ణ, నాబార్డు డీడీఎం అనూరాధ, ఇన్‌చార్జి తహసీల్దార్ మహబూబ్ బాషా, డిప్యూటీ తహసీల్దారు విశ్వనాథ్, ఆర్ఐ ప్రసన్నకుమార్ తదితరులు ఉన్నారు.

బాధితరైతులను ఆదుకోవాలి: సీపీఐ

బొమ్మనహాళ్, సెప్టెంబరు 4: మండలంలోని నేమకల్లు గ్రామ శివారులో ఉన్న స్పాంజ్ ఐరన్ ఫ్యాక్టరీ యాజమానులు పంటలు నాశనం చేస్తూ రైతుల జీవితాలతో చెలగాట మాడుతున్నారని, బాధిత రై


ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు

తులకు నష్టపరిహారం చెల్లించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, జిల్లా కార్యవర్గ సభ్యుడు నాగార్జున డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం వారు బాధిత రైతులతో కలిసి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఫ్యాక్టరీల ద్వారా వచ్చే కాలుష్యంతో సమీపంలోని పొలాల్లో పంటలు పండడం లేదన్నారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. దాదాపు 900 ఎకరాల్లో పంటలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పరిహారం అడిగితే యజమానులు రైతులపై దాడులకు పాల్పడుతున్నారని వాపోయారు. ఎకరాకు రూ. 30 వేల నుంచి రూ. 40 వేల వరకు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా న్యాయం జరగడం లేదన్నారు. రైతుల కోసం ఎందాకైనా పోరాడతామని తెలిపారు. అనంతరం తహసీల్దార్ మునివేలుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, తాలూకా కార్యదర్శి తిప్పేస్వామి, సీపీఐ ఉరవకొండ కార్యదర్శి మల్లికార్జున, ఏఐటీయూ, సీపీఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై సమీక్ష

కుందుర్పి, సెప్టెంబరు 4 : కలెక్టర్ ఆదేశాల మేరకు కళ్యాణదుర్గం డివిజనల్ లెవెల్ అభివృద్ధి అధికారి శంకర్ బుధవారం కుందుర్పి మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని కార్యాలయంలో మండల అధికారులతో సమావేశం నిర్వహించి అభివృద్ధి పనులపై సమీక్షించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పీపుల్స్ గ్రీవెన్స్ ప్రొడ్యూసర్ సిస్టమ్ ద్వారా వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులు, సిబ్బందికి సూచించారు. తర్వాత సచివాలయాల సిబ్బంది హాజరు, పనితీరును నివేదిక ఆధారంగా పరిశీలించారు. ఎంపీడీవో లక్ష్మీనరసింహ, తహసీల్దార్ శ్రీనివాసులు, డాక్టర్ అనూష, ఏపీవో ఓబిరెడ్డి, వైద్యసిబ్బంది, కార్యదర్శులు వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

జూనియర్ ఎన్టీఆర్ అభిమానుల ఆర్థికసాయం

గుత్తిరూరల్, సెప్టెంబరు 4: మండలంలోని బేతాపల్లికి చెందిన సుదర్శన్ అనే యువకుడికి ఎన్టీఆర్ అభిమాన సంఘం నాయకులు ఆర్థిక సాయం చేశారు. ఇటీవల సుదర్శన్ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. కాగా అతడి కుటుంబానికి జూనియర్ ఎన్టీఆర్ అభిమాన సంఘం రాష్ట్ర కన్వీనర్ నరేంద్ర చౌదరి, గుత్తి పట్టణ అధ్యక్షుడు రాజు రూ. 75 వేల ఆర్థిక సాయాన్ని బుధవారం గ్రామానికి వెళ్లి అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సాధిక్, బాల, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

24న హజరత్ సయ్యద్ బాషా ఉరుసు

గుత్తి, సెప్టెంబరు 4: పట్టణంలోని గుత్తికోటపై వెలసిన హజరత్ సయ్యద్ బాషా వలి ఉరుసు మహోత్సవాలు ఈనెల 24వ తేదీన అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు దర్గా కమిటీ నిర్వాహకులు బుధవారం ప్రకటనలో తెలిపారు. 23న గంధం, అదే రోజు రాత్రి డ్రామా, 24న ఉరుసు అదే రోజు రాత్రి ఖవ్వాలి నిర్వహించనున్నట్లు చెప్పారు. అలాగే 25న జియారత్, రాత్రి ఆర్కెస్ట్రా నిర్వహించనున్నామని అన్నారు.

టీడీపీలోకి వైసీపీ కౌన్సిలర్ చేరిక

గుంతకల్లు, సెప్టెంబరు 4: పట్టణంలోని రెండో వార్డుకు చెందిన వైసీపీ కౌన్సిలర్ మెహ్రున్నీసా బుధవారం టీడీపీలోకి చేరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఎమ్మెల్యే జయరాం, ఆయన సోదరుడు గుమ్మనూరు నారాయణస్వామి సమక్షంలో ఆమె పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్యే కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ.. అభివృద్ధి పనులు చేపట్టడంలో వైసీపీ విఫలమైందని, అందుకే ఆ


ఎమ్మెల్యే సమక్షంలో టీడీపీలోకి చేరుతున్న కౌన్సిలర్ మెహ్రున్నీసా

పార్టీ కౌన్సిలర్లు టీడీపీలోకి చేరుతున్నారని అన్నారు. రానున్న రోజుల్లో వైసీపీ ఖాళీ కావడం తథ్యమన్నారు. టీడీపీ నాయకులు బండారు ఆనంద్, బీఎస్ కృష్ణారెడ్డి, ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, గుమ్మనూరు వెంకటేశులు, కౌన్సిలర్లు కృపాకర్, ప్రభాకర్ పాల్గొన్నారు.

తెగిన కాలువ గట్టు పూడ్చివేత

కూడేరు, సెప్టెంబరు 4: మండలంలోని చోళసముద్రం గ్రామం వద్ద ఇప్పేరు, ముద్దలాపురం చెరువులకు నీరు వెళ్లే కాలువ గట్టు తెగిపోవడంతో బుధవారం అధికారులు పూడ్చివేశారు. గత రెండ్రోజుల క్రితం హంద్రీనీవా కాలువ నుంచి రెండు చెరువులకు నీరు వెళ్లే కాలువ గట్టు తెగిపోయింది. దీంతో నీరంతా రైతుల పంటపొలాల్లో చేరి పంటలు దెబ్బతిన్నాయి. విషయం తెలుసుకున్న ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ స్పందించి తెగిన గట్టును కాలువను తక్షణం పూడ్చివేయాలని ఆదేశించారు. దీంతో హెచ్ఎన్ఎస్ఎస్ ఈఈ స్వరూప్‌కుమార్, మైనర్ ఇరిగేషన్ ఈఈ ప్రసాద్ తదితర అధికారులు యుద్ధ ప్రాతిపదికన పూడ్చివేత పనులు చేపట్టారు. కాలువగట్టు తెగకుండా ఇసుక బస్తాలు వేసి మట్టిని వేయించారు.

మట్కా బీటర్లకు కౌన్సెలింగ్

తాడిపత్రి, సెప్టెంబరు4: పట్టణ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం మట్కాబీటర్లు, నిర్వాహకులకు సీఐ సాయిప్రసాద్ కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మట్కాను రాసినా, ఆడినా, ప్రోత్సహించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలను మానివేసి కష్టించి జీవించాలన్నారు. మట్కా మహమ్మారికి సామాన్య ప్రజలు కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. కావున మట్కాను వదిలివేయాలని, లేనిపక్షంలో కఠిన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

అక్రమ కట్టడాలను తొలగించండి

యాడికి, సెప్టెంబరు 4: మండలకేంద్రంలోని ప్రభుత్వ స్థలంలో అక్రమ కట్టడాలను తొలగించాలని కోరుతూ బుధవారం పలువురు యువకులు తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోనరోడ్డులోని 513 సర్వేనెంబరులో గల ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు చేశారని తెలిపారు. ఈ స్థలంలో ఎన్నో సంవత్సరాల నుంచి బ్యాడ్మింటన్ కోర్టు తయారు చేసుకుని స్థానిక యువత, విద్యార్థులు వినియోగించుకునేవారన్నారు. కాగా ఆ స్థలాన్ని పలువురు ఆక్రమించడమే కాకుండా నిర్మాణాలు మొదలుపెట్టారన్నారు. దీనిపై తగు చర్యలు చేపట్టాలని వారు కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో ప్రసాద్, వేణు, సునీల్, మణి, జనార్దన్, నూర్‌బాషా, రవిప్రసాద్ పాల్గొన్నారు.

అసత్య ప్రచారాలు మానుకో కాపూ..!

బొమ్మనహాళ్, సెప్టెంబరు 4: మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి అసత్య ప్రచారాలు చేయడం మానుకోవాలని, ఆయన అక్రమ వ్యాపారాల తప్పులను కప్పి పుచ్చుకోవడానికి ఇతరులపై నింద వేయడం మంచిది కాదని టీడీపీ మండల నాయకుడు కాంతారావు హెచ్చరించారు. మండలకేంద్రంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తాను కూటమి ప్రభుత్వాన్ని అడ్డుపెట్టుకుని అక్రమ వ్యాపారం చేస్తున్నాడని కాపు రామచంద్రారెడ్డి అసత్య ప్రచారాలు చేయడం సరికాదన్నారు. గతంలో ఎమ్మెల్యేగా ఉన్న ఆయన వైసీపీ ప్రభుత్వాన్ని అడ్డుపెట్టుకుని అనేక అక్రమ వ్యాపారాలు చేశారని విమర్శించారు. అక్రమ సంపాదనను కాపాడుకోవడానికి బీజేపీ గూటికి చేరారని దుయ్యబట్టారు. ఇప్పుడు మా మీద బుర ద జల్లుతుండడమేమటని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వంలో అలాంటివి జరగవని తెలిపారు. తమపై అసత్య ప్రచారాలు చేస్తే ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు.

పోలీస్ పికెట్ పరిశీలన

పుట్లూరు, సెప్టెంబరు 4: మండలంలోని కోమటికుంట్ల గ్రామంలో కొనసాగుతున్న పోలీస్ పికెట్‌ను ఎస్ఐ హేమాద్రి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో శాంతిభద్రతలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు సమాచారం ఇవ్వాలని సూచించారు.

తహసీల్దార్‌గా షర్మిల బాధ్యతలు

బెళుగుప్ప, సెప్టెంబరు 4: మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం నూతన తహసీల్దార్‌గా షర్మిల బాధ్యతలు చేపట్టారు. గతంలో నంద్యాల జిల్లా ఆత్మకూరు మండల తహసీల్దార్‌గా ఉన్న ఈమె బదిలీపై ఇక్కడికి వచ్చారు.

వైభవంగా సిడిమానోత్సవం

రాయదుర్గంరూరల్, సెప్టెంబరు 4: పట్టణంలోని మారెమ్మ ఆలయం వద్ద బుధవారం సిడిమాను ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు తొలుత ఆలయంలో అమ్మవారికి పంచామృతాభిషేకం, విశేష అలంకరణ చేసి ప్రత్యేకపూజలు, కుంకుమార్చన నిర్వహించారు. తర్వాత సాయంత్రం సిడిమాను ఉత్సవాన్ని వైభవంగా జరిపారు. ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ఆలయానికి చేరుకుని అమ్మవారి దర్శించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం సిడిమాను ఉత్సవాన్ని తిలరించారు. రాయదుర్గం పట్టణంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి సైతం భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఉత్సవాన్ని తిలకించారు. అదే విధంగా మండలంలోని ఆర్‌బీ వంక గ్రామంలో సిడిమాను ఉత్సవాన్ని గ్రామపెద్దల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలి

పౌష్టికాహార వారోత్సవాల్లో ఐసీడీఎస్ సీడీపీఓ సాజిదాబేగం

తాడిపత్రి, సెప్టెంబరు4: పట్టణంలోని హరిజనవాడలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో బుధవా రం పౌష్టికాహార మాసోత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సీడీపీఓ సాజిదాబేగం మా ట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, కిశోర బాలికలు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. దీని వల్ల రక్తహీనత ఉండదన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌ ష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపా రు. అనంతరం గర్భిణులకు సీమంతం నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు దస్తగిరమ్మ, లక్ష్మీదేవి, కౌన్సిలర్ వరలక్ష్మి, కోఆర్డినేటర్ పల్లవి, ఏఎన్ఎం సావిత్రి, ఆశ కార్యకర్త శ్యామల, అంగన్‌వాడీ వర్కర్లు లక్ష్మి కుళ్లాయమ్మ, సౌజన్య తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని నందలపాడు-2 అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పౌష్టికాహార మాసోత్సవాల్లో కౌన్సిలర్ విజయ్‌కుమార్ పాల్గొని మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు, కిశోర


గర్భిణులకు సీమంతం జరుపుతున్న సీడీపీఓ

బాలికల పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం అందించే ఆహారపదార్థాల్లో ప్రొటీన్లు, కాల్షియం సంపూర్ణంగా ఉంటాయని తెలిపారు. అనంతరం గర్భిణులకు, బాలింతలకు కోడిగుడ్లు పంపిణీ చేశారు. డాక్టర్ ముస్కిన్‌వలి, అంగన్‌వాడీ వర్కర్ అనిత, ఆర్గనైజర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సాగునీటిని సద్వినియోగం చేసుకోండి

కణేకల్లు, సెప్టెంబరు 4: హెచ్చెల్సీ ఆయకట్టు రైతులు సాగునీటిని సద్వినియోగం చేసుకోవాలని ఈఈ వెంకటరమణారెడ్డి కోరారు. మండలకేంద్రంలో హెచ్చెల్సీ పరిధిలోని పలు డిస్ట్రిబ్యూటరీలను, పిల్లకాలువలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆయకట్టు భూముల్లో ఇప్పటికే రైతులు వరిపంటలు సాగు చేస్తున్నారని, భవిష్యత్తులో నీటికి ఇబ్బంది రాకుండా పొదుపుగా వాడుకోవాలని తెలిపారు. అలాగే జిల్లాకు సాగునీటితో పాటు తాగునీటిని కూడా అందిస్తున్న హెచ్చెల్సీలో రైతులు పైపింగ్‌లు వేసుకోరాదన్నారు. కాగా పలువురు రైతులు డిస్ట్రిబ్యూటరీలు, పిల్లకాలువలు దెబ్బతిన్న విషయాన్ని ఈఈ దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో డీఈ మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

నూతన బస్సు ప్రారంభం

రాయదుర్గం రూరల్, సెప్టెంబరు 4: ప్రభుత్వం రాయదుర్గం డిపోకు అందించిన ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ నూతన బస్సు సర్వీసును ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు బుధవారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. ఆర్టీసీ అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఉదయం 8:30 గంటలకు, తిరిగి మధ్యాహ్నం 2:30 గంటలకు ఈ బస్సును అనంతపురానికి నడుపుతారన్నారు. ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ సురేష్‌బాబు, మాజీ కౌన్సిలర్ మాబుసాబ్ తదితరులు పాల్గొన్నారు.


నూతన ఎక్స్‌ప్రెస్ బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలవ

వరద బాధితులను ఆదుకుందాం

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీష్ పిలుపు


వరదబాధితులకు సాయం చేద్దాం కార్యక్రమంలో పాల్గొన్న జగదీష్ తదితరులు

గుంతకల్లుటౌన్, సెప్టెంబరు4: విజయవాడ, గుంటూరు ప్రాంతాల్లోని వరద బాధితులను ఆదుకునేందుకు రాష్ట్రంలోని ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా సాయం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డీ జగదీష్ పిలుపునిచ్చారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద బుధవారం ఆయన సీపీఐ ఆధ్వర్యంలో ఫ్లెక్సీలు చేతబట్టి వరద బాధితులకు సాయం చేద్దాం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అత్యధిక వర్షం వల్ల ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాలలో వరదలు వచ్చి లక్షలాది మంది ప్రజలు నిర్వాసితులయ్యారన్నారు. ప్రజలు కట్టుబట్టలతో వరద సహాయ కేంద్రాలకు తరలిపోయారన్నారు. ఇందుకు ప్రతిఒక్కరూ స్పందించి వారికి సాయం చేసేందుకు ముందుకు రావాలన్నారు. ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్ అకౌంట్‌కు, ఆన్‌లైన్ చెల్లింపులకు , ప్రభుత్వ క్యూఆర్ కోడ్‌కు, గూగుల్, ఫోన్‌పేల ద్వారా విరాళాలు పంపాలని సూచించారు. అలాగే ధాన్యం, బట్టలు తదితరాలను కలెక్టర్ల కార్యాలయానికి చేర్చాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, సహాయ కార్యదర్శి మహేష్, పట్టణ కార్యదర్శి గోపీనాథ్, సహాయ కార్యదర్శి ఎస్ఎండీ గౌస్, మండల కార్యదర్శి రాము, సహాయ కార్యదర్శి రామాంజనేయులు యాదవ్, నాయకులు పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలనే పూజించాలి

యాడికి, సెప్టెంబరు 4: వినాయక చవితికి మ ట్టితో తయారుచేసిన విగ్రహాలనే పూజించాలంటూ మం డలకేంద్రంలో స్టార్ ప్యారడైజ్ హైస్కూల్ విద్యార్థులు బుధవారం ర్యాలీ నిర్వహించారు. ప్రధాన వీధుల గుం డా ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా స్కూల్ యజమాని నాగేంద్ర మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయనాలతో తయారుచేసిన విగ్రహాలను వాడడం వలన జల కాలుష్యం, భూమి కాలుష్యం పెరుగుతుందన్నారు. దీని ప్రభావం ప్రాణులపై పడుతుందన్నారు. ఈ కాలుష్యాన్ని అరికట్టాలంటే మట్టితో తయారు చేసిన విగ్రహాలనే పూజించాలని తెలిపారు. పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వరద బాధితుల కోసం విరాళాల సేకరణ

కళ్యాణదుర్గం, సెప్టెంబరు 4: విజయవాడ ప్రాంతంలోని వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపు మేరకు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు బుధవారం విరాళాల సేకరణ చేపట్టారు. ఆర్డీఓ రాణిసుస్మిత చేతుల మీదుగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం, మున్సిపల్ కార్యాలయం, ట్రెజరీ, వివిధ బ్యాంకుల వద్దకు వెళ్లి విరాళాలను సేకరించారు. వారంరోజుల పాటు అన్ని ప్రభుత్వ , ప్రైవేటు, విద్యాసంస్థలు, బస్టాండ్ పరిసర ప్రాంతాలు, ఆస్పత్రులు, దుకాణాలు తిరిగి విరాళాలు సేకరించనున్నట్లు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి శ్రీధర్ తెలిపారు. అధ్యాపకులు పాల్గొన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

గుంతకల్లుటౌన్, సెప్టెంబరు 4: కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిని అత్యాచార చేసి హత్యచేసిన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ ఐఎఫ్‌టీయూ నాయకులు డిమాండ్ చేశారు. వైద్యురాలి మృతికి పట్టణంలో పొట్టిశ్రీరాములు విగ్రహం బుధవారం రాత్రి కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్, నాయకులు రఘునాథ్‌రెడ్డి, జిలాన్, సత్తార్ తదితరులు పాల్గొన్నారు.

కారు ప్రమాదంలో విశ్రాంత ఉద్యోగి మృతి

●మరొకరికి గాయాలు

పావగడ, సెప్టెంబరు 4 : పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని కెంచగానిపల్లి గేటువద్ద బుధవారం జరిగిన కారు ప్రమాదంలో... ఆంధ్రాలోని కంబదూరు మండలం తిమ్మాపురానికి చెందిన విశ్రాంత ఉద్యోగి వీరన్న(72) అనే వ్యక్తి మృతి చెందగా, అతడి తమ్ముడు చిక్కీరప్ప తీవ్రంగా గాయపడినట్లు పోలీసులు తెలిపారు. వీరన్న, చిక్కీరప్ప బుధవారం తి మ్మాపురం నుంచి సొంత పనుల నిమిత్తం కారు(ఏపీ02ఏడీ6254)లో వెళ్తున్నారు. పావగ డ సమీపంలో కెంచగానిపల్లి గేటువద్ద కల్వర్టును ఢీకొని కారు చెట్లపొద ల్లోకి కారు దూసుకెళ్లింది. చుట్టుపక్కలవారు గమనించి పావగడ పోలీసు లకు సమాచారం అందించారు. వారిని 108 వాహనంలో పావగడ ప్రభు త్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందిన అనంతరం వీరన్నను బెంగళూరులోని ఓ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. గాయపడిన చిక్కీరప్ప పావగడ ఆసుపత్రిలో చికిత్సపొందుతున్నాడు. ఈ ప్రమాదంపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పావగడ పోలీసులు తెలిపారు.